రూ॥ 10/-

జనరాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-1 సంచికలు - 11,12 పక్షపత్రిక జూన్1-30, 2010



# అమెరికాలో జేపీ పర్యటన




వాషింగ్టన్ డిసిలో ప్రసంగిస్తున్న డా॥ జేపీ



వాషింగ్టన్ డిసిలో



బే ఏరియాలో



బోస్టన్‌లో



అట్లాంటాలో



బే ఏరియా లో



న్యూజెర్సీలో



న్యూజెర్సీలో

# అవినీతి నాయకుల భరతం పట్టండి

**సంపాదకీయం**

**రా**ష్ట్రంలో అవినీతి విశృంఖలంగా పెరిగిపోయింది. దోషులు దర్జాగా తప్పించుకుంటున్నారు. అవినీతిని నిర్మూలించకపోయినా కనీసం నియంత్రించే రీతిలో కూడా సర్కారు వ్యవహరించలేకపోతోంది.

అవినీతిపై మాటలతో కాలక్షేపం చేయకుండా చేతల్లో కట్టడి చేసే విధంగా అవినీతి నిరోధక బిల్లును సవరించే ముసాయిదా బిల్లును లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్ని పార్టీల నేతలకూ పంపించారు. ఆ బిల్లు చట్టరూపం దాలిస్తే, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పంచాయతీల్లో, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికైన ప్రతినిధులందరూ కూడా ప్రజాసేవకుల పరిధిలోకి వస్తారు. అవినీతి నిరోధక చట్టం నిబంధనలు వారికి వర్తిస్తాయి.

ప్రస్తుత చట్టంలోని లొసుగులు ఎ.సి.బి చేతులు కట్టివేయటం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. కోర్టు తీర్పు పుణ్యమాని, ఐ.ఎ.ఎస్ అధికారుల మీద ఆలస్యంగానైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఎ.సి.బి దాడులు ప్రారంభించింది.

అవినీతికి పాల్పడ్డ ప్రజాసేవకుల ఆస్తుల్ని విచారణ సమయంలో స్వాధీనం చేసుకునేలా, నేరం రుజువైతే ఆస్తుల్ని జప్తు చేసేలా అవినీతి నిరోధక చట్టాన్ని సమగ్రంగా సవరించటమే శాశ్వత పరిష్కారం.

లోక్‌సత్తా ప్రతిపాదించిన బిల్లు ద్వారా అవినీతి కేసుల విచారణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టు ఏర్పాటవుతుంది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లు నియమితులవుతారు, ఎ.సి.బికి స్వయంప్రతిపత్తి లభిస్తుంది.

2008లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి మరీ అప్పటి అధికార, ప్రతిపక్ష నేతల అక్రమ ఆస్తుల ఆరోపణలపై చర్చించారు. అయితే ఇంతవరకూ నిజాలు నిగ్గు తేల్చి దోషుల్ని శిక్షించాలని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నించకపోవటం ఆశ్చర్యకరం. ప్రజలకు రాజకీయాల పట్ల పూర్తి విశ్వాసం పోకుండా ఉండాలంటే, అవినీతి నిరోధక చట్టానికి సమగ్ర సవరణలు తప్పనిసరి. ❍



– సి.ఎస్. లెవిన్
పాశ్చాత్య తత్వవేత్త

***ఒక గుడ్డు పక్షిగా మారడం చాలా కష్టమైన పని. గుడ్డుగా వుంటూనే ఎగరడం నేర్చుకోవడం దుస్సాధ్యం. మనం ప్రస్తుతం గుడ్లలా వున్నాము. కానీ నిరవధికంగా మనం ఒక మామూలు అందమైన గుడ్డులా వుండలేము. పొదగబడి పక్షిగానైనా మారాలి, లేదా కుళ్ళిపోవాలి.***

## లోపలి పేజీల్లో...


మార్పుకోసం కృషి చేద్దాం.................... 5
వార్డు కమిటీల రిగ్గింగ్ అప్రజాస్వామికం.... 6
మీడియా స్వేచ్ఛ.............................. 7
కౌలు రైతులకు మొండిచెయ్యి................ 9
ప్రజలను ప్రభుత్వం దోపిడీ చేయరాదు...... 10
ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి................ 11
ఉగ్రవాదం శాశ్వత నిర్మూలన................ 12
అద్భుతాల కోసం ఎదురు చూడవద్దు........ 13
ఉన్నత విద్యకు చౌకవడ్డీ ఋణపథకం....... 14
చిదిమిన బాల్యం.............................. 15
ఆర్థిక సంక్షోభం స్వయంకృతం................16
లక్ష్యసాధనకై ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం. 17
తుఫాను ప్రాంతాల్లో లోక్‌సత్తా సహాయం.....19
అవినీతి నిరోధక చట్టం........................20
ప్రజలే గ్యారంటీ...............................21
అతివాద ధోరణులు విడనాడండి............ 22
జగన్ పర్యటనపై చర్చ అవసరమా?.........23
నాయకత్వం – సమాచార పంపిణీ.......... 24
జిల్లాల సమాచారం........................... 25


**మిత్రత్వం కోసం ప్రాణం ఇవ్వడం కష్టం ఏమీ కాదు, అంతటి త్యాగం చేసే స్నేహితుడిని పొందడమే కష్టం** – హోమ్

# లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

**జూన్ 1-30, 2010   సంపుటి - 1   సంచిక - 11, 12**

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082
ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**


# మన రాజ్యాంగం

## పౌరసత్వం

**5. ఈ సంవిధానం ప్రారంభంనాటి పౌరసత్వం**

ఈ సంవిధానం ప్రారంభం అయ్యే తేది నాటికి ఎ) భారతదేశంలో జన్మించిన వ్యక్తి, లేక బి) తల్లిదండ్రులలో ఏ ఒక్కరైనా భారతదేశంలో జన్మించిన వారి సంతతి సి) సంవిధానము ప్రారంభమగు నాటికి భారతదేశములో 5 సంవత్సరములకు తగ్గని కాలంపాటు సాధారణముగా నివసించుచున్న వ్యక్తి భారతపౌరుడగును.

**8. వేరే ఇతర దేశములలో నివసిస్తున్న జన్మత భారతీయులైన వారి పౌరసత్వ హక్కు**

ఆర్టికల్ 5లో ఏ విధంగా ఉన్నా ప్రవాస భారతీయులను కూడా భారతపౌరులుగా భావించవచ్చు. అయితే వారి తండ్రి, తల్లి, తాత, నాయనమ్మ, అమ్మమ్మలు ఎవరైనా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆక్ట్ 1935లో నిర్వచించిన అవిభక్త భారతదేశంలో జన్మించిన వారయి ఉండి మరియు వారు నివసిస్తున్న దేశంలోని భారత రాయబార కార్యాలయమందు భారత పౌరసత్వ హక్కు నిమిత్తం అందుకొరకై డొమినియన్ ఆఫ్ ఇండియా లేక భారత ప్రభుత్వం నిర్ణయించిన నమూనాలో ఈ సంవిధానం ప్రారంభమునకు ముందు గానీ లేక తరువాత గానీ దాఖలు చేసుకొనిన యెడల అట్టి వ్యక్తిని భారతపౌరుడిగా పరిగణించవచ్చు.

**9. తమంతట తాము ఇతర దేశములందు పౌరసత్వ హక్కును సంపాదించుకొన్నవారు భారతపౌరులు కారు.**

తమంతట తాముగా ఏ ఇతర దేశములోనైన పౌరసత్వ హక్కు సంపాదించుకొన్నవారు భారతీయ పౌరులు కారు. ఆర్టికల్ 5, ఆర్టికల్ 8లోని అంశములు వారికి వర్తించవు.

**మీరూ రాయండి :** లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.

**గతాన్ని గుర్తుపెట్టుకోని వారు, తిరిగి గతాన్ని అనుభవించవలసి వస్తుంది**

– జార్జి శాంతాయన్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్ | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |
| ఫ్రంట్‌పేజి 1/4 | - | రూ॥ 10,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు

### మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com

### లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

బుక్ & కవర్ డిజైన్: **సునీత అరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**

**అవినీతిపై కొరడా ఝుళిపించే వ్యవస్థను ఎందుకు నిర్మించుకోలేకపోతున్నాం?**

# అల్ప విభేదాలను అధిగమించి 'మార్పు' కోసం కృషి చేద్దాం



న్యూజెర్సీలో డా॥ జేపీ

**'భా**రత్‌కు నూతనోత్తేజం' పేరుతో పీపుల్ ఫర్ లోక్‌సత్తా ఆధ్వర్యంలో అమెరికాలో జరుగుతున్న కార్యక్రమాల్లో పాల్గొన్న జయప్రకాష్ నారాయణ్... న్యూజెర్సీలోని పలు సమావేశాల్లో మాట్లాడారు.

"బరాక్ ఒబామా అధ్యక్ష పదవికి ఎన్నికవటంతో ఖాళీ అయిన ఆయన సెనేటర్ పదవిని ఇవ్వటానికి ఎన్నికల ప్రచార నిధుల్ని ఇవ్వాలని అడిగినందుకు అమెరికాలో ఒక గవర్నర్‌ను నిద్రలేపి మరీ పోలీసులు అరెస్టు చేశారు. వ్యక్తిగత ఖాతాలోకి ముడుపులేవీ కూడా అడగపోయినా ఆ గవర్నర్ రాజకీయ జీవితం సమాధి అయిపోయింది. అవినీతిపై అలాంటి కఠినచర్యలు తీసుకునే వ్యవస్థను భారతదేశంలో కూడా తీసుకురావాలని మనం ఎందుకు సంకల్పించలేకపోతున్నాం?" అని లోక్‌సత్తా అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అమెరికా న్యూజెర్సీలోని ప్రవాస భారతీయుల్ని ప్రశ్నించారు. "భారత్‌లో డా॥ మన్మోహన్ సింగ్, ఎ.కె ఆంటోనీ, ఎల్. కె అద్వానీ, అరుణ్‌జైట్లీ, నరేంద్ర మోడీ, బుద్ధదేవ్ భట్టాచార్య, ప్రకాష్ కారత్, నితీష్‌కుమార్ వంటి నిజాయతీపరులైన నేతలు ఉన్నారని, అయితే వ్యవస్థలోని లోపాల వల్ల వారు రాజకీయాల్ని నిర్దేశించలేకపోతున్నారన్నారు. మన మధ్య ఉన్న అల్ప విభేదాలను, కులం, మతం, ప్రాంతం, భాష పరిమితుల్ని అధిగమించి భారతీయులుగా ప్రయత్నం ప్రారంభిస్తే కేవలం 10ఏళ్లలో మన ముందున్న సవాళ్లన్నిటినీ జయించి, వ్యవస్థను మార్చగలుగుతాం, 'గ్రేటర్ ఇండియా'ను సాధించగలుగుతాం" అన్నారు.

ఈవేళ మనం ఎదుర్కొంటున్న సమస్యల్నే రేపటి తరం వారు కూడా ఎదుర్కొంటే అది మనందరికీ అవమానకరమని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. "ఈరోజు సమస్యల్నే రేపు కూడా దేశం ఎదుర్కోవటమంటే అది తీవ్ర వైఫల్యమే అవుతుంది. 50ఏళ్ల క్రితం ఉన్న సమస్యల గురించి ఈరోజు అమెరికాలో చర్చ కనిపించదు. కానీ భారత్‌లో మాత్రం ఆనాటి సమస్యలపైనే ఈనాటికీ పోరాటం చేయాల్సివస్తోంది. కనీసం ఈతరంలోనైనా ఆ తప్పిదాన్ని సరిచేసుకుందాం. మన ముందున్న సవాళ్లను మనమే పరిష్కరిద్దాం. భావితరాలు తమ కాలంలో ఎదురయ్యే కొత్త సమస్యల మీద దృష్టి పెట్టే అవకాశాన్నిద్దాం" అన్నారు.

భారత్‌లో సరైన వ్యక్తికి ఓటు వేయటానికి ప్రస్తుత ఎన్నికల విధానం ప్రధాన అవరోధంగా ఉందని, దాన్ని సవరించి దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెడితే దేశంలో కీలక మార్పు సాధ్యమవుతుందన్నారు. దాంతోపాటు విద్యావంతులు, ప్రభావశీలురు రాజకీయాలను ఒక వ్యాపారంగా కాకుండా ఒక బాధ్యతగా భావించే ధోరణి రావాలన్నారు. మధ్యతరగతివారు పోలింగ్ బూత్‌లకు వెళ్లనంతవరకూ మార్పు సాధ్యంకాదన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలలో 41శాతం ఓట్లు పోలయ్యాయని, అందులో మద్యం, డబ్బు వల్ల వచ్చినవారు 30శాతం అనుకుంటే 11శాతం ఓట్లు మాత్రమే అసలైనవి అని జేపీ అన్నారు. "పోలింగ్ బూత్‌లకు వెళ్లనివారంతా ఓ అద్భుతం జరుగుతుందనో, బాబా వచ్చి మార్పు తెస్తాడనో నమ్ముతున్నారా?" అని ప్రశ్నించారు. అలాంటప్పుడు మనకు తగ్గ ప్రభుత్వాలే వస్తాయన్నారు. జీహెచ్ఎంసీలో లోక్‌సత్తా ఒక్క సీటు కూడా గెలవకపోయినా, దాదాపు 70 డివిజన్లలో మంచి అభ్యర్థులను నిలబెట్టిందని, బలమైన ఎజెండాతో గట్టి ప్రచారం చేసిందని అన్నారు. కానీ ఎవరో అభ్యర్థిని ఓడించాలనుకున్న ప్రజలు... తమకు సరైన అభ్యర్థిని ఎన్నుకోవటం మీద దృష్టి పెట్టలేదన్నారు. గతంలో కాస్త తక్కువ చెడ్డపార్టీని ఎంచుకోవటం తప్ప గత్యంతరంలేదని ప్రజలు ఫిర్యాదు చేసేవారని, ప్రత్యామ్నాయ వేదికగా లోక్‌సత్తా వచ్చాక ఎవరినీ నిందించే అవకాశం వారికి లేదని స్పష్టంచేశారు. ❍

# పురపాలనపై మంత్రుల పెత్తనమేమిటి ?

- ఉపాధి హామీ నుంచైనా గుణపాఠం నేర్చుకోవాలి
- బీపీఎస్ నిధులను వార్డు కమిటీల ఆధ్వర్యంలోనే ఖర్చు చేయాలి: లోక్‌సత్తా డిమాండ్

అక్రమ భవన నిర్మాణాల (బీపీఎస్), అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) ద్వారా వసూలు చేసిన నిధుల వినియోగంపై జిల్లా ఇంఛార్జి మంత్రులకు పెత్తనం కట్టబెట్టటం తీవ్రంగా గర్హనీయం. మంత్రితో సంప్రదించి, ఆమోదం పొందాక ఖరారు చేసిన పనులకే నిధుల్ని ఖర్చుచేయాలని జారీ చేసిన ఉత్తర్వు (జివో 190) రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమే కాక స్థానిక ప్రభుత్వాల సాధికారతను దెబ్బతీయటమే. అమాత్యుల ప్రమేయం లేకుండా స్థానికంగా ఎన్నికైన వార్డు కమిటీల ఆధ్వర్యంలోనే పనుల నిర్ధారణ, పురపాలక సంఘాల నిధుల వినియోగం జరగాలని లోక్‌సత్తా డిమాండ్ చేస్తోంది.

రాజ్యాంగం ఆర్టికల్ 243 (ఎస్) ప్రకారం, ఎన్నికైన స్థానిక వార్డు కమిటీల ద్వారా మాత్రమే ఈ డబ్బు ఖర్చు చేయాల్సి వుంది. క్రమబద్ధీకరణ నిధుల్లో కనీసం 50శాతం స్థానిక వార్డుల్లో ఖర్చు చేయాలి. మిగిలిన 50శాతం కూడా మంత్రుల ప్రమేయంలేకుండా కౌన్సిల్ తీర్మానానికనుగుణంగానే ఆయా పురపాలక సంఘాల్లో, కార్పొరేషన్లలో ఖర్చు చేయాలి.

స్థానిక ప్రభుత్వాల వ్యవహారాల్లో మంత్రుల పెత్తనం వల్ల పెద్దఎత్తున అధికార దుర్వినియోగం జరిగి ప్రజాప్రయోజనాలు పక్కదోవ పడతాయి. అమాత్యుల ఆదేశాల్ని ధిక్కరించే శక్తి స్థానిక యంత్రాంగానికి సాధారణంగా ఉండదు. వార్డుల్లో పనులు లేవనో, ఇంకో సాకుతోనో బీపీఎస్, ఎల్ఆర్ఎస్ నిధులు కూడా దుర్వినియోగమయ్యే అవకాశాలున్నాయి. స్థానిక ప్రభుత్వాల్లో అవకతవకలేవైనా ఉంటే, విచారించి తగు చర్యలు తీసుకునే పాత్రకు మాత్రమే రాష్ట్రప్రభుత్వం పరిమితం కావాలి.

మరోవైపు, ఆస్తిపన్నును కూడా విధించి ఆదాయం పెంచుకోండని స్థానిక ప్రభుత్వాలకు రాష్ట్ర సర్కారు సలహాలిస్తోంది. అయితే తాము చెల్లించిన పన్నుల డబ్బు సద్వినియోగమవుతూ తమకు నాణ్యమైన సేవలు అందుతాయన్న విశ్వాసం లేకపోవటం వల్ల ప్రజల్లో అందుకు వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజలు ఎన్నుకున్న వార్డు కమిటీలకు నిధుల్ని, బాధ్యతల్ని అప్పచెప్పి పౌరుని చుట్టూ పాలన తెస్తేనే, పన్నులు చెల్లించటానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తారు. ❍

# వార్డు కమిటీల రిగ్గింగ్ అప్రజాస్వామికం

- జనం చేతికి అధికారం ఇవ్వకపోతే తిరగబడే రోజు వస్తుంది - కమిటీల ఎన్నికల్లో కుమ్మక్కవుతున్న పార్టీలకు లోక్‌సత్తా హెచ్చరిక

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసి) వార్డు కమిటీల సభ్యుల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు 'మ్యాచ్ ఫిక్సింగ్'కు పాల్పడుతుండటం దిగ్భ్రాంతికరం. "వార్డు కమిటీల ఏర్పాటు వెనక మౌలిక సూత్రాన్నే దెబ్బతీసే చర్య అది. ప్రతి కార్పొరేటరూ తన సొంత మనుషులు ఐదుగురిని వార్డు సభ్యులుగా నియమించుకునేందుకు, మిగిలిన ఐదుగురు సభ్యులనూ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర పార్టీనేతలూ నియమించుకునేట్టు పార్టీల మధ్య స్థూలంగా అంగీకారం కుదిరింది.

జనం చేతికి అధికారాన్నిచ్చి పరిపాలనలో వారిని భాగస్వాముల్ని చేసేందుకు వార్డు కమిటీలు ఒక ఆచరణాత్మక మార్గం. వార్డులోని ఓటర్లు కమిటీలో సభ్యుల్ని ఎన్నుకోవాల్సి ఉంది. కానీ స్థానిక ప్రభుత్వాల సాధికారతను అణగదొక్కేందుకు అలవాటుపడిన ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు వల్ల వార్డు కమిటీలకు దరఖాస్తుదారుల నుంచి సభ్యులను ఎన్నిక చేసే అధికారం 150మంది సభ్యుల మున్సిపల్ కౌన్సిల్‌కు ధారాదత్తమైంది.

మున్సిపల్ కౌన్సిల్‌లో మెజారిటీ కలిగిన కాంగ్రెస్, మజ్లిస్‌లు అన్ని వార్డులకు తమ సొంతమనుషుల్ని ఎంపికచేయగలవు. అయితే ఆ పరిస్థితి పట్ల అప్రమత్తమైన టీడీపీ, బీజేపీ నేతలు కాంగ్రెస్, ఎంఐఎంతో ఒప్పందం కుదుర్చుకుని ప్రతి కార్పొరేటర్‌కూ తన ఏరియాలో ఐదుగురు కోటా ఉండేలా ఏర్పాటు చేసుకున్నారు. కార్పొరేటర్ల చేతిలో కీలుబొమ్మలుగా ఉండే వార్డు కమిటీల వల్ల ఏ విధమైన ప్రయోజనం ఉండదు. రాజకీయాల పట్ల ప్రజల్లో ఇంకా ద్వేషం పెరిగి వారు తిరగబడక ముందే నేతలు మేలుకొని ప్రజల భాగస్వామ్యాన్ని గౌరవించాలి. ❍

# స్వయం నియంత్రణే మీడియా స్వేచ్ఛకు రక్షణ

**- డి.వి.వి.యస్. వర్మ**

**మీ**డియా స్వేచ్ఛకు రక్షణేదీ?" అంటూ రాష్ట్ర స్థాయిలో జర్నలిస్టు సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. ఉస్మానియా యూనివర్శిటీలో గత ఫిబ్రవరిలో జర్నలిస్టుపై జరిగిన పోలీసు దాడి ఈ ఆందోళనకు కారణంగా ఉంది. దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోలేదని, ప్రెస్ కౌన్సిల్ సిఫారసులపై కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నందని అందుచేత మీడియా స్వేచ్ఛకు రక్షణ ఎక్కడని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల దురుసుతనాన్ని అందరూ ఖండించారు. బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అందరూ డిమాండ్ చేశారు. ప్రభుత్వ అలసత్వాన్ని అందరూ దుయ్యబట్టారు. ఈ సమస్యలో మీడియా స్వేచ్ఛ ఇమిడి వున్నా ప్రధానంగా జర్నలిస్టుల రిపోర్టింగ్ హక్కులకు సంబంధించినది ప్రధాన అంశం. మీడియా స్వేచ్ఛ ఇంతకంటే విశాలమైంది. బహుముఖమైంది. అందుచేత మీడియా స్వేచ్ఛ అంటే ఏమిటి? దాని పరిమితులు ఏమిటి? దానికి రక్షణ ఎలా వస్తుంది అన్న అంశాలను మరింత లోతుగా పరిశీలించుకోవడం అవసరం.

రాజ్యాంగం ఆర్టికల్ 19(1ఎ) ద్వారా పౌరులందరికీ భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించింది. ఈ భావ ప్రకటనకు సాధనాలుగా మీడియా పుట్టుకొచ్చింది. ఈ సాధనాలకు యాజమాన్యాలు వుంటాయి. జర్నలిస్టులు ఇందులో పనిచేసే ఉద్యోగులు మాత్రమే. భావప్రకటనా స్వేచ్ఛ పౌరుల ప్రాథమిక హక్కు. మీడియా స్వేచ్ఛ అంటే సాధనాలకు ఇచ్చే స్వేచ్ఛ లేదా అవి పొందే స్వేచ్ఛ. ఈ రెండూ ఒకటిలాగే కనిపించినా ఒకటి మాత్రం కావు. భావప్రకటనా స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా ప్రసాదిస్తూనే రాజ్యాంగం కొన్ని పరిమితులను విధించింది. నియంత్రణాధికారాలను ప్రస్తుత చట్టాలకి, అవసరమైతే హేతుబద్ధమైన పరిమితులు విధించే కొత్త చట్టాలు తేవడానికి ప్రభుత్వాలకు అధికారాన్ని ఇచ్చింది. ఈ హేతుబద్ధమైన అంశాలను ఏ అంశాలకు వర్తించేది పేర్కొంది. దేశ సమైక్యత, సమగ్రత, ఆంతరంగిక భద్రత, విదేశాలతో సత్సంబంధాలు, శాంతి భద్రతల పరిరక్షణ, సభ్యత, నైతికతలను కాపాడడం, కోర్టు ధిక్కారాలను, పరువు నష్టాలను, నేరాలకు పురికొల్పడం వంటి వాటిని ఆ జాబితాలో చేర్చింది.




పౌరుల ప్రాథమిక హక్కుకే పరిమితులు ఆంక్షలు వున్నప్పుడు దాని వ్యక్తీకరణ సాధనాలైనా మీడియాకు ఈ ఆంక్షల నుండి మినహాయింపు వుండదు. పైగా ఒక సాధనంగా మీడియాకు బహుముఖమైన లక్ష్యాలు వుంటాయి. వ్యాపారలక్ష్యాలు, పోటీలు, రాజకీయాలు, పెయిడ్ న్యూస్‌లు, వ్యాపార ప్రకటనలు, బ్లాక్‌మెయిల్ వసూళ్లు వగైరాలన్నీ మీడియా నిర్వహణలో అంతర్భాగాలు. మీడియా విశ్వరూప సందర్శనం చేసుకుంటే గాని పౌరుల భావ ప్రకటనా స్వేచ్ఛకీ, మీడియాకి మధ్య ఉన్న అంతరం అర్థం కాదు.

మానవులు తమ అవసరాల కోసం సృష్టించుకున్న డబ్బు ఒక స్థాయి దాటిన తర్వాత అది మనిషినీ, సమాజాన్ని శాసించే స్థితిని తెచ్చుకోవడం మనం చూస్తున్నాం. అలాగే మీడియా ఆధిపత్యం ఒక స్థాయి దాటితే అది సమాజాన్ని, రాజకీయాలని శాసించే స్థితిని పొందుతుంది. అంతిమంగా భావప్రకటనా స్వేచ్ఛ మీద స్వారీ చేస్తుంది. దానిని తన సొత్తు చేసుకుని పౌరుల హక్కుని నియంత్రిస్తుంది, శాసిస్తుంది. అందుచేత పరిధులు దాటిన మీడియా సమాజహితానికంటే హాని చేస్తుంది. భావవ్యక్తీకరణ ముసుగు మీడియా ఆధిపత్యానికి రహదారి కాకూడదు.

ఒకటి రెండు సంవత్సరాల కిందట సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ వారు ఒక సెమినార్‌ను నిర్వహించారు. అందులో మన

రాష్ట్రంలోని ప్రముఖ సంపాదకులు, జర్నలిస్టులు, సంఘాలు పాల్గొన్నాయి. మీడియా లక్ష్మణరేఖను దాటుతున్నదని స్పష్టంగా ప్రకటించారు. ఇది వాంఛనీయం కాదని నిగ్గుదేల్చారు. ఇప్పటికే జర్నలిస్టులలో చాలా మంది ఈ లక్ష్మణ రేఖకు అవతలకు చేరుకున్నారు. ప్రముఖ పత్రికలు ఎప్పుడో గీతను దాటేశాయి. ఎలక్ట్రానిక్ మీడియాకు అసలు గీతలే లేవు. దీనికి ఎవరినో ఒకరిని నిందించి లాభం లేదు. ఇది విస్తృతమైన పోటీలో భాగం, అక్రమార్జన పర్వంలో భాగం. మన సమాజంలో అన్ని రంగాలకీ సోకిన జబ్బులో భాగం.

జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు "పౌరుల భావ ప్రకటనా స్వేచ్ఛకి" ప్రతినిధులు కావాలి. ఈ స్వేచ్ఛకు రాజ్యాంగం సూచించిన పరిమితుల పట్ల స్వయం క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ పాటించాలి. భావ వ్యక్తీకరణ సాధనంగా వున్న మీడియా స్వేచ్ఛకు పరిరక్షకులుగా వుండాలి. ఇంతవరకు రాజ్యాంగ రక్షణ వారికి కూడా కవచంలాగా ఉంటుంది. ఇక మీడియాకు వున్న రెండవ ముఖం వ్యాపార క్రీడ ఆధిపత్యం పెనుగులాట అంతిమంగా లక్ష్మణరేఖ ఆవల చేసే కార్యకలాపాలతో మీడియా స్వేచ్ఛ పేరుతో సమర్థకులు కాకూడదు.

ఇక చివరిగా జర్నలిస్టు సంఘాలు పదేపదే వల్లిస్తున్న ప్రెస్ కౌన్సిల్ సిఫారసులలో రెండు అంశాలను ప్రస్తావించడం అవసరం. మొదటిది ఉస్మానియా యూనివర్శిటీ ఘటన మీద నివేదిక ఇవ్వడానికి ప్రెస్ కౌన్సిల్ ఒక ఎసెస్‌మెంట్ కమిటీని నియమించింది. అందులో ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించిన ఇద్దరు ప్రముఖుల్ని సభ్యులుగా నియమించింది. ఈ ఇద్దరూ చాలా మందికి అభిమానపాత్రులు. వారి నిజాయితీని కూడా ఎవరూ శంకించరు. ఒక ఉద్యమ నేపథ్యంలో ఈ ఘటన జరిగింది. ఈ ఉద్యమం సందర్భంగా ప్రాంతాలవారీగా పోలీసు అధికారులమీద, ప్రభుత్వ అధికారుల మీద, చివరికి పరీక్ష పేపర్లు దిద్దే అధ్యాపకులు మీద అనుమానాలు, అభియోగాలు, అభిశంసనలు మారు మోగుతున్న నేపథ్యంలో అదే ప్రాంతానికి చెందిన వారిని ఆ ఉద్యమాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా సమర్థకులుగా వున్న వారిని సభ్యులుగా నియమించడం పూర్తిగా అనాలోచితంగా కనిపిస్తున్నది. ఇది సిఫారసుల విశ్వసనీయతకి వన్నె తెచ్చేదిగా లేదు. ఈ ఇద్దరూ లేకపోయినా అవే సిఫారసులు వచ్చి వుండేవి. ఎందుకంటే అందుకు తగిన ఆధారాలు ఇబ్బడిముబ్బడిగా వున్నాయి. శంకించే వాళ్లకి అవకాశం ఇచ్చేలా వ్యవహరించడంలో విజ్ఞత కనిపించడం లేదు.

ఇక రెండవది, ప్రెస్ కౌన్సిల్ ఒక చట్టబద్ధ సంస్థ. పైగా క్వాజీ జుడీషియల్ అధికారాలున్న సంస్థ. తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిఫారసు చెయ్యడాన్ని ఎవరూ తప్పుపట్టరు. కాని ఈ ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారుల్ని మీడియాతో సంబంధం లేని పోస్టులలో నియమించరాదని చేసిన సిఫారసు అర్థరహితమైంది. ఎందుకంటే మీడియాకు సంబంధం లేని రంగాలున్నాయని అంగీకరించడం అంటే పాలనలో మీడియా దూరని చీకటి ప్రాంతాలున్నట్టు భావించాలి. అంతకు మించి ఈ సిఫారసు తన పరిధిని దాటి చేసినదిగా కనిపిస్తున్నది.

ఇటీవలి కాలంలో కొంత మంది న్యాయమూర్తులు, కొన్ని చట్టబద్ధ సంస్థలు తమ పరిధికి సంబంధం లేని తీర్పులు చెప్పడం పరిపాటి అయింది. రాజ్యాంగబద్ధ సంస్థలు, చట్టబద్ధ సంస్థలు కంచే చేను మేసినట్లు వ్యవహరించకూడదు.

పోలీసు ఆఫీసర్లని, ఎవరి ఎక్కడ నియమించాలన్న అధికారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిది. ఎన్నికల సమయంలో భారత ఎన్నికల కమిషన్‌కి తప్ప సుప్రీంకోర్టుతో సహా మరే ఇతర రాజ్యాంగబద్ధ సంస్థలకైనా రాష్ట్రప్రభుత్వాల అధికారాన్ని తామే చెలాయించే అవకాశం లేదు, అధికారం లేదు. దీనికి ఒక చోట అవకాశం

> ***జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు "పౌరుల భావ ప్రకటనా స్వేచ్ఛకి" ప్రతినిధులు కావాలి. ఈ స్వేచ్ఛకు రాజ్యాంగం సూచించిన పరిమితుల పట్ల స్వయం క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ పాటించాలి. భావ వ్యక్తీకరణ సాధనంగా వున్న మీడియా స్వేచ్ఛకు పరిరక్షకులుగా వుండాలి. ఇంతవరకు రాజ్యాంగ రక్షణ వారికి కూడా కవచంలాగా ఉంటుంది.***

ఇస్తే కోర్టులు, చట్టబద్ధ సంస్థలు రోజుకొక్క పాలనాధికారాన్ని సొంతం చేసుకుంటూ పోతే పరిపాలన నిర్వీర్యం అవుతుంది. ప్రజలు పాలనాధికారాన్ని ఇచ్చింది చట్టసభలకి, ప్రభుత్వాలకి. దానిని వేరొకరు చెలాయించడానికి పూనుకోవడం రాజ్యాంగ విరుద్ధం. అందుచేత ప్రెస్‌కౌన్సిల్ చేసిన ఈ సిఫారసు సమర్థనీయం కాదు. దీని అమలు చెయ్యకపోతే మీడియాకు రక్షణ లేదన్నట్లు ఆందోళనలు చెయ్యడం ఉచితం కాదు. హక్కుల కోసం పోరాడడం వేరు, అవధులు దాటిన హక్కులని ఆశించడం వేరు.

అందుచేత పౌరుల భావవ్యక్తీకరణకీ, మీడియా స్వేచ్ఛకీ రాజ్యాంగం పరిధిలో స్వయం నియంత్రణ పాటించినంత వరకు రాజ్యాంగమే రక్షణ కవచంగా వుంటుంది. రాజ్యాంగానికి అతీతంగా ఎదగాలనుకుంటే దురాశ దుఃఖానికి చేటు అవుతుంది. ❍

# కౌలు రైతులకు ఈ ఏడాదీ మొండిచెయ్యే



- **సమస్యపై సర్కారు వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి : లోక్‌సత్తా**
- **మహిళాబృందాలకు భూముల కౌలు చట్టం నష్టదాయకమే అవుతుందని స్పష్టీకరణ**

వ్యవసాయ రుణాలను ఏటా పెంచుకుంటూ వెళ్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం వాటిని కౌలుదారులకు అందించే నిర్దిష్ట విధివిధానాల్ని రూపొందించటంలో తాజా రుణప్రణాళికలో కూడా ఘోరంగా విఫలమైంది. వ్యవసాయం చేస్తున్న సుమారు 30లక్షల మంది కౌలుదారులకు రుణసదుపాయాలు అందకపోవటానికి సర్కారే పూర్తి బాధ్యత వహించాలి. ఊరడింపులు, ఊరింపులు తప్ప కౌలుదారుల పరిరక్షణకు నిర్దిష్టచర్యలేవీ బ్యాంకర్ల సమావేశంలో రోశయ్య సర్కారు ప్రతిపాదించలేకపోయింది. గత ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఆ రైతులకు బ్యాంకులు మొండిచెయ్యి చూపటం ఖాయంగా కన్పిస్తోంది.

రాష్ట్రంలోని సాగులో చాలావరకు కౌలు పద్ధతిలోనే సాగుతోంది. 99 శాతం కౌలుదార్ల పేర్లు ఎక్కడా నమోదు కాలేదు. దానివల్ల బ్యాంకర్ల నుంచి అందే రుణాలతో పాటు ప్రభుత్వం నుంచి అందే విత్తన రాయితీలు, పంట బీమా, ఇతర ప్రోత్సాహకాలు కూడా కౌలురైతులకు అందటం లేదని దీర్ఘకాలంగా తెలుస్తున్నా, ఆ సమస్యను సరిచేసేందుకు ప్రభుత్వం ఇప్పటివరకూ పటిష్టచర్యలు చేపట్టలేకపోవటం విచారకరం. సర్కారు నుంచి, బ్యాంకుల నుంచి ఎటువంటి సాయం లేకపోవటం వల్ల కౌలుదార్లు హెచ్చు వడ్డీలకు ప్రైవేటు వ్యాపారుల నుంచి తెచ్చుకుంటున్నారు. ఏ ప్రకృతి వైపరీత్యం వచ్చినా కోలుకోలేనిరీతిలో పేదరికం ఊబిలో కూరుకుపోతున్నారు. సమస్యపై ప్రభుత్వం స్పందిస్తున్న తీరు సమస్యను ఇంకా జటిలం చేసేలా ఉంది. మహిళాస్వయం సహాయక బృందాలకు కౌలు లీజు ఇచ్చే చట్టానికి ప్రయత్నించటం మరిన్ని సమస్యలకు దారితీస్తుంది. స్వయంసహాయక బృందాలతో వ్యవసాయం అంటే సహకార వ్యవసాయమేనని, వ్యవసాయంలో సహకార పద్ధతి ఏమాత్రం ఆచరణసాధ్యంకాదు. చివరికి నష్టదాయకంగానే పరిణమిస్తుంది. కౌలురైతులకు ప్రభుత్వ సాయం, బ్యాంకు రుణాలు క్రమబద్ధంగా అందేలా చట్టపరమైన మార్పులకు, అవసరమైన చర్యలను రూపొందించటానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి.

మరోవైపు, గత ఏడాది లక్ష్యాన్ని మించి వ్యవసాయ రుణాలు ఇచ్చినట్టు బ్యాంకర్ల సమావేశంలో సమర్పించిన గణాంకాల్లో చూపారు. అయితే ఆ రుణాల్లో బంగారం, ఇతర తాకట్టు రుణాలు కూడా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకులు రుణమంజూరులో వివక్ష చూపుతున్నాయి. దాంతో రైతులు గత్యంతరం లేక ప్రైవేటు వడ్డీలకు, బంగారునగలు తాకట్టు పెట్టుకున్నారు. గతంలో వారంలో ఒక్కసారి ఇచ్చే బంగారు తాకట్టు రుణాలు సీజన్‌లో అన్నిరోజులూ ఇచ్చారు. గ్రామాల్లోకి వెళ్తే అసలు విషయం తెలుసుకోవచ్చు. బ్యాంకర్లు నగలపై ఇస్తున్న తాకట్టు రుణాలను కూడా వ్యవసాయ రుణాలుగా చూపించి లక్ష్యాల్ని అధిగమించామన్నట్టు చెప్పుకున్నారు. ఈ వైఫల్యాల్ని సరిచేసేందుకు ప్రభుత్వం మొక్కుబడిగా కాకుండా, ఆచరణాత్మకంగా స్పందించాలి. ప్రతి వ్యవసాయదారునికీ రుణసదుపాయం, ప్రభుత్వం నుంచి ఇతర సహాయాలు గ్యారంటీగా అందే ఏర్పాటు చేయాలి. ❍

## లోక్‌సత్తా పార్టీ సభ్యులకు విజ్ఞప్తి

★ లోక్‌సత్తా పార్టీ భావజాలాన్ని కార్యకలాపాలను సామాన్య ప్రజలకు చేరువగా తీసుకువెళ్ళే ముఖ్య సాధనంగా వెలువడుతున్న 'లోక్‌సత్తా టైమ్స్' పక్ష పత్రికను ప్రజా బాహుళ్యంలోకి తీసుకువెళ్ళడంలో మీ పాత్ర ఎంతో ముఖ్యమైనది.

★ మీలో ప్రతీ ఒక్కరూ, ప్రతీనెలా కనీసం 5గురు చందాదారులను చేర్పించవలసినదిగా మనవి.

★ మీ సలహాలు, సహాయ సహకారాలు పత్రిక అభ్యున్నతికి, తద్వారా పార్టీ పురోగతికి తోడ్పడతాయని మరువవద్దు.

# ప్రజలను దోపిడీ చేయడం ప్రభుత్వం లక్ష్యం కారాదు



- **"ఆదాయం రూ. 15,000కోట్లు... ఆరోగ్యనష్టం రూ.16,944 కోట్లు మద్యం విధానం పై ధ్వజమెత్తిన లోక్‌సత్తా**
- **జోక్యం చేసుకోవాలని భారత ఆరోగ్య మంత్రి ఆజాద్‌కు లేఖ"**
- **మద్యం విధానాల అమలు బాధ్యతను రాష్ట్రాల ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖకు బదిలీ చేయించాలని విజ్ఞప్తి**

మద్యం వల్ల రాష్ట్రంలో దాదాపు 75లక్షల కుటుంబాలు నాశనమైనా పట్టించుకోకుండా పాత విధానాన్నే కొనసాగిస్తూ మద్యం వేలంపాటల్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీరు గర్హనీయం.

మద్యం దుకాణాలకు వేలం పాట పెడితే, అత్యధిక బిడ్ వేసిన వారికి లైసెన్సుల్ని కేటాయిస్తారు. షాపుల యజమానులు ఆదాయాన్ని పెంచుకునేందుకు సాధ్యమైనన్ని ఎక్కువ అనధికార దుకాణాలు లేదా బెల్టుషాపుల ద్వారా అమ్మకాలు చేస్తారు. గత కొన్నేళ్లుగా ఇదే తంతు జరుగుతూ వస్తోంది. గత వేలం పాటలో కొన్ని దుకాణాలు ఒక్కొక్కటి కోటిరూపాయల వరకూ పలికాయి. బెల్టుషాపులు లేకుండా వారికి లాభం ఎలా వస్తుంది? ప్రభుత్వం మద్యాన్ని ఆదాయమార్గం చేసుకోవటం వల్ల రాష్ట్రంలో ఇప్పటికే 150,000 బెల్టుషాపులు ఉన్నట్టు లోక్‌సత్తా పార్టీ ర్యాండమ్ సర్వేలో తేలింది. జులై 1తో ప్రారంభమవుతున్న ఎక్సైజ్ సంవత్సరంలో లైసెన్సు ఫీజు, ఎక్సైజ్, అమ్మకపు పన్ను, ఇతర రకాల ఛార్జీల ద్వారా సుమారు రూ.15,000కోట్ల ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్జించనుంది. ఇదంతా పేదప్రజలను పీల్చిపిప్పి చేయటం ద్వారా దండుకునేదే.

కిలోబియ్యం రూ.2 పథకం, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు, విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్పులు, రైతులకు ఉచిత విద్యుత్తు వంటి పథకాల మీద పెట్టే ఖర్చుకన్నా మద్యం ద్వారా ప్రజల నుంచి అనైతికంగా, నేరసమానరీతిలో పిండుతున్న ఆదాయం ఎక్కువ.

ప్రజారోగ్యం, సంక్షేమంతో సంబంధం లేకుండా కేవలం మద్యం ద్వారా ఆదాయాన్ని పెంచటం మీదే ఎక్సైజ్ శాఖ దృష్టి పెడుతుంది కాబట్టి, మద్యం నిబంధనల బాధ్యతల నుంచి ఆ శాఖను తప్పించాలని భారత ఆరోగ్యశాఖ చేసిన సూచనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. మద్యం విధానాల రూపకల్పన, సమగ్ర మద్యం వినియోగ విధానం అమలు బాధ్యతల్ని రాష్ట్రాల ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖకు అప్పచెప్పాలని కేంద్ర ఆరోగ్యశాఖ సూచించింది.

భారత ప్రభుత్వ సలహాను రాష్ట్ర ప్రభుత్వం పాటించాలి. మద్యం వినియోగంపై నియంత్రణ వల్ల వచ్చే ఆదాయనష్టాన్ని ఢిల్లీ నుంచి వచ్చే నిధుల ద్వారా భర్తీ చేసుకోవాలి.

ఈ వివరాలన్నిటినీ తెలియచేస్తూ... రాష్ట్రాల్లో ఆరోగ్య విభాగాలు మద్యం సంబంధ అన్ని విషయాల్నీ పర్యవేక్షించేలా నిర్దిష్ట చర్యల్ని చేపట్టాలని భారత ఆరోగ్య మంత్రి గులాం నబీ ఆజాద్‌కు లోక్‌సత్తా పార్టీ లేఖ వ్రాసింది. అవసరమైతే, రాష్ట్రాల జాబితాలోకి వచ్చే అంశం మీద ఆర్టికల్ 249 కింద భారత ప్రభుత్వం చట్టం చేయవచ్చు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌కు, ముఖ్యమంత్రికి కూడా లేఖ ప్రతుల్ని పంపడం జరిగింది.

మద్యం ద్వారా ఆదాయాన్ని దండుకుంటున్న వైనాన్ని కప్పిపుచ్చుకునేందుకు, మహిళల నుంచి ప్రతిఘటనల్ని పక్కదోవ పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మద్యవిమోచన ప్రచార కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ఆ నటనకు కూడా స్వస్తి పలికింది. కాలపరిమితి తీరినా కమిటీని తిరిగి నియమించలేదు.

మద్యం వేలంపాటల విధానాన్ని విరమించుకుని ప్రభుత్వమే పరిమిత సంఖ్యలో మద్యం దుకాణాల్ని నిర్వహించాలి. బెల్టుషాపుల్ని, అక్రమ మద్యాన్ని నియంత్రించే అధికారాన్ని పంచాయతీలకు అప్పచెప్పాలి. ❍

మద్యం వేలం పాటలు నిలుపు చేయించండి

# పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యాన్ని, ఆదాయాన్ని కాపాడండి

**రాష్ట్ర మానవహక్కుల సంఘం చైర్మన్‌కు లోక్‌సత్తా విజ్ఞాపనపత్రం**



రాష్ట్రంలో లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలను చిదిమేస్తున్న మద్యం ద్వారా మరింత ఆదాయాన్ని పెంచుకునేందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ నెలలో మద్యం దుకాణాలకు వేలంపాటల్ని నిర్వహిస్తోందని, రాష్ట్ర మానవహక్కుల సంఘం జోక్యం చేసుకుని వెంటనే వేలంపాటల్ని నిలుపుచేసేలా ఆదేశాలివ్వాలని లోక్‌సత్తా పార్టీ విజ్ఞప్తి చేసింది. వేలంపాటల వల్ల ఒక్కో దుకాణం కోట్లల్లో పలుకుతుందని, 2008 వేలంలో కొన్ని షాపులు కోటిరూపాయలవరకూ పలకటం వల్ల అంత డబ్బు వెచ్చించాక లాభాల కోసం అనధికార బెల్టుషాపుల్ని తెరిచి మద్యాన్ని ప్రవహింప చేస్తున్నారు. మద్యం అందుబాటులో ఉండటం వల్లే చాలామంది పేదలు, ముఖ్యంగా గ్రామాల్లో యువత మద్యం అలవాటు చేసుకుంటున్నారు. మద్యం వ్యాప్తికి దోహదపడుతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న మద్యం వేలంపాటల విధానాన్ని నిలిపివేసేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా కోరింది...

లోక్‌సత్తా బెల్టుషాపుల వివరాలను, మద్యం సమస్యను పలుదఫాలుగా రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన బెల్టుషాపులనేవే లేవు అని ప్రభుత్వం తరచూ సమస్యను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసింది. 2008లో ఎక్సైజ్ వేలంపాటల సందర్భంగా లోక్‌సత్తా గట్టిగా ప్రతిఘటించినా సర్కారు లెక్కచేయలేదు. బెల్టుషాపుల్ని, మద్యం విక్రయాల్ని యధేచ్ఛగా ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే... బెల్టుషాపులుంటే చెప్పండి మూసివేస్తాం అని ఒకసారి, బెల్టుషాపుల్ని మూసివేయటం సాధ్యం కాదన్నట్టు మరోసారి మాట్లాడుతున్నారు. 2009 సాధారణ ఎన్నికల సమయంలో లోక్‌సత్తా ఫిర్యాదు మేరకు కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించి కేవలం రెండువారాల్లో ప్రస్తుతమున్న అధికార యంత్రాంగంతోనే చాలా బెల్టుషాపుల్ని మూసివేయించింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మద్యాన్ని నియంత్రించటం ఏమాత్రం అసాధ్యం కాదని స్పష్టమవుతోంది.

మద్యం ద్వారా వచ్చే ఆదాయం కంటే దానివల్ల కలిగే ఆరోగ్యపరమైన నష్టం కనీసం 15శాతం ఎక్కువ అని ప్రపంచ ఆరోగ్యసంస్థ కోసం 'నిమ్‌హ్యాన్స్' సంస్థ జరిపిన ప్రామాణిక సర్వేలో తేలింది. ఈ లెక్కన ఈ ఏడాది మన రాష్ట్రంలో మద్యం ద్వారా రూ. 15,000కోట్లు ఆదాయం వస్తే రాష్ట్రప్రజలు ఆరోగ్యపరంగా రూ. 16,900కోట్లు కోల్పోతారు. వైద్యం ప్రైవేటీకరించబడుతున్న దశలో భారం మొత్తం ప్రజలమీదే పడుతోంది. ఇది ఏరకంగా చూసినా ప్రభుత్వం చేస్తున్న అనైతిక, అమానుష, ప్రజావ్యతిరేక చర్య. కిలోబియ్యం రెండురూపాయల పథకం, ఇందిరమ్మ ఇళ్లు, పావలావడ్డీ రుణాలు, రైతులకు రుణమాఫీ అంటూ మీరు చెప్పుకుంటున్న సంక్షేమ పథకాలన్నిటికీ మద్యం అమ్మకాల్నే ఆదాయమార్గం చేసుకోవటం దారుణం. దీన్ని సంక్షేమం అనగలమా?

మద్యం కోసం రాష్ట్ర ప్రజలు చేస్తున్న ఖర్చు, దాని వల్ల తలెత్తే ఆరోగ్య దుష్పరిణామాలకు చేస్తున్న వ్యయం కలిపితే మొత్తం మద్యం వల్ల ఏటా సుమారు రూ. 36,000కోట్లు ప్రజల డబ్బుకు గండిపడుతోంది. దీనిమీద స్పందించిన భారత ఆరోగ్యశాఖ మద్యం విధాన రూపకల్పన, అమలు బాధ్యతను ఎక్సైజ్ విభాగం నుంచి తప్పించి రాష్ట్రాల ఆరోగ్య, శిశుసంక్షేమశాఖలకు అప్పచెప్పాలని ప్రతిపాదన కూడా చేసింది. ఎక్సైజ్ శాఖ మద్యాన్ని కేవలం ఆదాయమార్గంగానే చూస్తుంది కాబట్టి ఆరోగ్యశాఖ నియంత్రణ ఉండాలని స్పష్టం చేసింది. ఆ మేరకు రాష్ట్రప్రభుత్వాలకు లేఖ రాసినట్టు కూడా తెలిపింది. ఒకవేళ రాష్ట్రానికి మద్యం ద్వారా వచ్చే ఆదాయానికి గండిపడితే కేంద్రప్రభుత్వం నుంచి భర్తీ చేయించేందుకు కూడా ప్రయత్నిస్తామని తెలిపింది. ఇలాంటి ప్రత్యామ్నాయ ఆదాయమార్గాలను పరిగణన లోకి తీసుకుని మద్యాన్ని ఆదాయమార్గంగా చేసుకునేందుకు చేస్తున్న మద్యం వేలంపాటల్ని ఆపేలా మీ పరిధిలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

లోక్‌సత్తా విజ్ఞప్తికి మానవ హక్కుల సంఘం ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఎక్సైజ్ శాఖకు వెంటనే లేఖ రాసి వివరాలు తెప్పించుకుని తగురీతిలో చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ❍

# ఉగ్రవాదం శాశ్వత నిర్మూలన దిశగా చర్యలు, విధానాలు ఉండాలి: లోక్‌సత్తా



**26/11** ముంబయి మారణహోమం కేసులో దోషి అజ్మల్ అమీర్ కసబ్ కేసులో భారత న్యాయవ్యవస్థ చురుగ్గా స్పందించి పరిమిత కాలవ్యవధిలోనే తీర్పును వెలువరించటం, భావోద్వేగాల ఒత్తిడి ఎంతో తీవ్రంగా ఉన్నప్పటికీ, ప్రతీకారాన్ని ప్రాతిపదికగా తీసుకుని నిర్ణయాలు చేయకుండా చట్టప్రకారం విచారణ జరిపి తీర్పునివ్వటం అభినందనీయం.

కసబ్‌కు ఉరిశిక్ష వేయటం భారత్ మీద దాడిచేసే ఉగ్రవాదులకు ఓ హెచ్చరిక అయితే భారత ప్రజలు, రాజకీయ పార్టీలు కూడా ఈ సమస్యను కేవలం ప్రతీకారానికి సంబంధించిన కోణానికి పరిమితం చేయకుండా సమగ్ర దృష్టితో వ్యవహరించాలి. ఘటనలు జరగకుండా నిర్దిష్ట చర్యలు చేపట్టటం తక్షణావసరం. గత నాలుగేళ్లలో ఇరాక్ తర్వాత అత్యధిక ఉగ్రవాద దాడులకు గురైన దేశం భారత్ మాత్రమే. గత 26ఏళ్లలో ఉగ్రవాదదాడుల బారినపడి మరణించిన వారి సంఖ్య ప్రపంచం మొత్తం మీద మనదేశంలోనే అత్యధికం.

"తమ సంకుచిత ప్రయోజనాలను పక్కకుపెట్టి దేశసమగ్రతను కాపాడటానికి రాజకీయ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వాలు నడుంబిగించాలి. అసాధారణ పరిస్థితుల్లో అసాధారణ చర్యలు అవసరమని నేతలు గుర్తించాలి. దేశం ఉగ్రవాదం బారిన పడకుండా ఉండేందుకు భద్రతాపరంగా అత్యాధునిక చర్యల్ని, కఠిన చట్టాల్ని అమలుచేయాలి. తీవ్రవాదంపై, చొరబాటుదార్లపై చట్టపరంగా కఠినచర్యలను మతంపేరుతో అడ్డుకోకూడదు. తీవ్రవాదానికి మతం ఉండదు. అలాగే భారతీయులందరికీ జాతీయ గుర్తింపు కార్డులు ఇచ్చేలా అన్ని రాజకీయపార్టీలూ సహకరించాలి. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం దీనికి మోకాలడ్డకూడదు. అతితక్కువ వ్యవధిలోనే ఈ ప్రతిపాదనను ఆచరణలో చూపగల సాంకేతిక పరిజ్ఞానం, వనరులు మన వద్ద ఉన్నాయి". అదే సమయంలో స్థానికుల ప్రోత్సాహం లేకుండా విదేశాల నుంచి ఉగ్రవాదులు మన దేశంలో దాడులకు తెగబడలేరని గుర్తించాలి. ఉగ్రవాదానికి ప్రోత్సాహం దొరకకుండా ఉండాలంటే పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను, ఉపాధి నైపుణ్యాల్ని, ఎదిగే అవకాశాల్ని అందించాలి, లేకుంటే ఎంతమందిని ఉరితీసినా ఉగ్రవాద దాడుల్ని అడ్డుకోవటం సాధ్యం కాదు. ❍

## సహజ వనరులన్నీ ప్రజలకు చెందినవే
## సహజ వాయువుపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన లోక్‌సత్తా

సహజవాయువు వినియోగం, ధర నిర్ణయంపై భారత ప్రభుత్వానిదే పూర్తి అధికారమని అంబానీ సోదరుల వివాదం కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సహజ వనరులన్నీ ప్రజలకు చెందినవేనని, కేజీ బేసిన్ గ్యాస్ అంబానీల సొంత ఆస్తికాదని లోక్‌సత్తా తొలినుంచి పేర్కొంటున్న వాదనని బలపరుస్తోంది.

ప్రజాప్రయోజనాల ప్రాతిపదికన సహజ వనరుల వినియోగంపై వ్యవహరించాల్సివుంది, ఆంధ్రప్రదేశ్ గ్యాస్ అవసరాలన్నీ పూర్తిస్థాయిలో తీర్చే రీతిలో భారత ప్రభుత్వం వ్యవహరించాలి.

అద్భుతాల కోసం
ఎదురుచూడొద్దు...
స్వాతంత్ర్యోద్యమ
కాలంలోలా బాధ్యత
తీసుకోండి

అమెరికాలో
ఎన్నారైలతో
డా॥ జేపీ



# ఇల్లు చక్కదిద్దితే భారత్ బలమైన ఆర్థికశక్తిగా రూపుదిద్దుకుంటుంది

'**భా**రత్‌కు నూతనోత్తేజం' పేరుతో పీపుల్ ఫర్ లోక్‌సత్తా (పీఎఫ్ఎల్) సంస్థ అమెరికాలోని వివిధ నగరాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఎన్నారైలనుద్దేశించి జేపీ ప్రసంగాలు చేసారు. ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మే 6 నుంచి 9వ తేదీ వరకు బోస్టన్, కనెక్టికట్ నగరాల్లో జరిగిన కార్యక్రమాల్లో యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భారతదేశంలో రాజకీయాల్ని, పాలనావ్యవస్థను ప్రక్షాళన చేసి ఇల్లు చక్కదిద్దుకుంటే ప్రపంచ జి.డి.పిలో 15శాతాన్ని సాధించి భూగోళం మీద రెండో ప్రధాన ఆర్థికశక్తిగా ఎదగగలుగుతుందని, ఈ కృషిలో ప్రవాస భారతీయులు కీలకపాత్ర పోషించాలని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఎన్నారైలు చాలా కీలక పాత్ర పోషించారని, ఈవేళ ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన సమాజాల్ని చూసిన ఎన్నారైలు తిరిగి ఆ మంచి మార్పుల్ని భారత్‌లో సాధించేందుకు దోహదం చేయాలని అన్నారు. భారత్‌కు, ఇతర ప్రపంచానికి ఎన్నారైలు వారధిలాంటి వారని, భారత్ తరుపున వారు బ్రాండ్ అంబాసిడర్లని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించటం, మౌలిక సదుపాయాల్ని మెరుగుపరచటం, స్థానిక ప్రభుత్వాలకు అధికారాన్నివ్వటంతో పాటు అవినీతిని అంతం చేయటం ఈరోజు భారత్‌లో రావాల్సిన కీలక మార్పులని స్పష్టంచేశారు. వీటిని సాధించటం పూర్తిగా సాధ్యమని, కావలసిందల్లా రాజకీయ సంకల్పం మాత్రమేనన్నారు. రాజకీయాలను పట్టించుకోకుండా వదిలేస్తే అవకాశాలున్నా అందుకోలేని దుస్థితిలోనే భారత్ కొట్టుమిట్టాడాల్సి ఉంటుందని హెచ్చరించారు. "మనందరం ఏదోకరూపంలో అవినీతి, దోపిడీ, అణచివేతలకు గురవుతున్నా నిస్సహాయులుగా భావించుకుంటూ యధాతథ పరిస్థితితో రాజీ పడిపోతున్నాం. కానీ గాంధీ అనే బారిస్టర్ దక్షిణాఫ్రికాలో తన పట్ల వర్ణవివక్షతను ప్రదర్శిస్తే ఆగ్రహించి తిరగబడ్డాడు. నిర్మాణాత్మక పోరాటంతో ఎదుర్కొన్నాడు. మహాత్ముడయ్యాడు" అని జేపీ పేర్కొన్నారు. అద్భుతాల కోసం ఎదురుచూడకుండా భారత్‌లో మార్పు కోసం మీ వంతు పోరాటం చేయండని ఎన్నారైలను కోరారు.

మరోవైపు, భారత్‌లో ఎన్నికల వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండటం వల్ల ఓట్లు కొనటం పెద్దఎత్తున జరుగుతోందని, ఆ వ్యవస్థను కూడా సమూలంగా సరిచేయాల్సి వుందని జేపీ పేర్కొన్నారు. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే అనే ఎన్నికల విధానాన్ని మార్చి, దామాషా (నైష్పత్తిక ప్రాతినిధ్య) ఎన్నికల విధానాన్ని మనదేశంలో ప్రవేశపెట్టాల్సి ఉందన్నారు. 80 ఏళ్ల క్రితం పార్టీ రిజిస్టర్ అయిన నాటి నుంచి తొలిసారిగా బ్రిటన్‌లో లిబరల్ డెమోక్రాటిక్ పార్టీ చరిత్రాత్మక విజయాన్ని సాధించటంతో అక్కడ కూడా దామాషా ఎన్నికల పద్ధతి వస్తుందని ఆశిస్తున్నట్టు జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.

సమావేశాలకు హాజరైన పలువురు ఎన్నారైలు పీపుల్ ఫర్ లోక్‌సత్తా సభ్యత్వం తీసుకున్నారు. స్వదేశంలో మార్పు కోసం తమ వంతు సహకారం, సమయం ఇచ్చేందుకు ఎన్నారైలు ఉత్సాహంతో ముందుకొచ్చారు. ❍

# ఉన్నత విద్యకు చౌకవడ్డీ ఋణపథకం ప్రతిపాదనను స్వాగతించిన లోక్‌సత్తా

**బ్యాంకులలకు ప్రభుత్వమే ష్యూరిటీ ఇవ్వాలని, పేదరికం కారణంగా ఏ విద్యార్థి ఉన్నత చదువులూ ఆగకూడదని డిమాండ్**

ఉన్నత విద్య చదువుకునే విద్యార్థులకు 4శాతం వడ్డీరేటుతో బ్యాంకుల నుంచి రుణం ఇప్పించే పథకాన్ని అమలు చేయాలని భారత మానవవనరుల శాఖ చేస్తున్న ప్రయత్నాన్ని పూర్తిస్థాయిలో స్వాగతిస్తున్నామని లోక్‌సత్తా పార్టీ పేర్కొంది. అణగారిన వర్గాలతోపాటు పేదవిద్యార్థులకు ఈ సదుపాయం కల్పించటం వల్ల విద్యావ్యవస్థలో మంచి మార్పు వస్తుంది. యువత సంఖ్య శరవేగంగా పెరుగుతున్న మనదేశంలో మానవవనరుల అభివృద్ధికి ఇది కీలక అడుగు.

12వ తరగతి వరకూ అందరికీ ప్రభుత్వమే ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలి. ఆ తర్వాత పేదరికం కారణంగా పైచదువులు చదువుకో లేకపోయాననే బాధ ఏ విద్యార్థికీ ఉండకుండా ప్రభుత్వమే తోడ్పాటునివ్వాలని తొలినుంచి లోక్‌సత్తా చెబుతోంది. కానీ విద్యను అందరికీ అందుబాటు లోకి తెచ్చి మానవ వనరుల్ని అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వాలు అందుకు పూర్తి విరుద్ధంగా విద్యారంగంలో ప్రైవేటు, వ్యాపార ధోరణులను స్వయంగా ప్రోత్సహించటం వల్ల కోట్లాదిమంది పిల్లలు మనదేశంలో ఇప్పటివరకూ ఎదిగే అవకాశాలను కోల్పోయారు. ప్రభుత్వ అసంబద్ధ విధానాల వల్లే ఇటీవల విద్యారంగానికి కేటాయింపులు పెరుగుతున్నా ఫలితాలు మాత్రం అరకొరగానే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కొంతమంది విద్యార్థులకు ఫీజులు రీఇంబర్స్ చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చినా... నిధుల కొరత అనే సాకు వల్ల కొందరికే అవి అందే పరిస్థితి ఏర్పడింది. అవి కూడా సకాలంలో అందటం లేదు. అర్హుల సంఖ్యకు తగ్గట్టు నిధుల్ని అందించలేక ప్రభుత్వం చేతులెత్తేయటం వల్ల ఆ పథకం పరిమిత ఫలితాలనందించే పరిస్థితి ఏర్పడింది. బ్యాంకుల ద్వారా ప్రభుత్వమే చౌకవడ్డీకి రుణాలను అందిస్తే అర్హులైన ప్రతి విద్యార్థీ ఎటువంటి ఆందోళన లేకుండా ఉన్నత విద్య చదువుకునే వీలు ఏర్పడుతుంది.



విదేశీ విశ్వవిద్యాలయాలు కూడా మనదేశంలోకి వస్తున్న ప్రస్తుత తరుణంలో సామాన్య యువతకు కూడా ఉన్నత విద్య అందాలంటే పెద్దఎత్తున రుణసదుపాయం అందాల్సి ఉంది. బ్యాంకుల ద్వారా రుణసదుపాయాల కల్పనలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా కేంద్ర మానవవనరుల శాఖ పకడ్బందీగా పథకాన్ని రూపొందించాలి. రుణాలకు ప్రభుత్వమే గ్యారంటీ ఇవ్వాలి. అవసరమైతే ఒక పరిధివరకూ వడ్డీ మాఫీని కూడా పరిశీలించాలి.

రుణం కేటాయింపునకు విద్యార్థి ఆస్తిపాస్తుల్ని పరిగణలోకి తీసుకునే పరిస్థితి ఉండకూడదు. విద్యార్జనతో సమాజంలో సంపద సృష్టించగల సామర్థ్యాన్నే పరిగణనలోకి తీసుకోవాలి. యూనిక్ ఐ.డి కార్డు వంటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక, విద్యార్థి ఉద్యోగం లేదా ఉపాధి నిమిత్తం ఎక్కడున్నా బ్యాంకులు గుర్తించి రుణాన్ని క్రమపద్ధతిలో వసూలు చేసుకునే వీలుంది. విద్యార్థులకు తక్కువ వడ్డీకి అందించటంతోపాటు వెనకబడిన ప్రాంతాల్లో విద్యాసంస్థల అభివృద్ధికి, అన్ని విద్యాసంస్థల్లో నాణ్యతాప్రమాణాలు పెంచటానికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలి. ❍

## కావలెను

- ★ ప్రజాశ్రేయస్సే పరమావధిగా నెలకొల్పబడిన లోక్‌సత్తా పార్టీ భావజాలాన్ని, దైనందిన విషయాలపై లోక్‌సత్తా పార్టీ ప్రతిస్పందనలను ప్రజల్లోకి తీసుకువెళ్ళే సాధనం 'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక.
- ★ ఈ పత్రికకు చందాదారులను చేర్పించేందుకు ఆసక్తిగల యువతీయువకులు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో కావలెను.
- ★ మరిన్ని వివరాలకై స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయాన్నిగాని, రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్నిగాని సంప్రదించగలరు.

## నేటి బాలలే రేపటి పౌరులు

# చిదిమిన బాల్యం

- బండారు రామ్మోహన్‌రావు



***అంతర్జాతీయ కార్మిక సంస్థ "ఐ.ఎల్.ఓ" (ఇంటర్ నేషనల్ లేబర్ అర్గనేషన్) బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఒక సంకేతం ఇవ్వడానికి బాల కార్మికుల వ్యతిరేక దినంగా 2002 జూన్ 12ను ప్రకటించింది. 8 ఏళ్ళ తరువాత ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితులను గమనిస్తే ఆఫ్రికా– ఆసియా దేశాలలోని బాలకార్మికుల సంఖ్య ఎక్కువ అని వారిని బడికి పంపి బావి పౌరులుగా తయరుచేయడానికి ఎంత మంది కృషి చేసినా తక్కువేనని చెప్పింది. గడిచిన దశాబ్దకాలంగా ప్రపంచ వ్యాప్తంగా బాలకార్మికుల వ్యవస్థపై చైతన్యం పెరిగింది. సుమారు 200 మిలియన్ల బాలకార్మికులను వారి హక్కులను కాపాడుతూ, భవిష్యత్తు సమాజంలో బాలకార్మికులు లేని వ్యవస్థగా తీర్చుదిద్దడానికి మన అందరి మీద బాధ్యత ఉంది.***

### బాలకార్మికులు - ఆసియా, పసిఫిక్ దేశాల్లోనే ఎక్కువ

ప్రపంచవ్యాప్తంగా బాలకార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గుతున్నా ఆసియా–పసిఫిక్ దేశాల్లో బాలకార్మికుల సంఖ్య చాలా ఎక్కువగా ఉన్నట్లు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) తెలిపింది. బాలకార్మికులు, పేదరికం, రైతుల స్థితిగతులపై ఈ సంస్థ తాజాగా ఒక నివేదిక రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా బాలకార్మికుల (5 నుంచి 14 ఏళ్లలోపు) సంఖ్య 26 శాతం మేర తగ్గినట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు.

ఇంతకుముందు 12, 20 కోట్లుగా ఉన్న బాలకార్మికుల సంఖ్య ఇప్పుడు 26 శాతానికి తగ్గి 9.60 కోట్లకు చేరినట్లు అందులో వివరించారు. అయితే ఆసియా– పసిఫిక్ దేశాల్లో బాలకార్మికుల (5 నుంచి 17 ఏళ్లలోపు) సంఖ్య మాత్రం 11.36 కోట్లుగా ఉందని, ప్రపంచంలోని మిగతా ప్రాంతాలతో పోల్చుకుంటే ఇది చాలా ఎక్కువని నివేదికలో వివరించారు. సబ్–సహారా ఆఫ్రికా దేశాల్లో 6.51 కోట్లు, లాటిన్ అమెరికా, అరేబియన్ దేశాల్లో 1.41 కోట్ల మంది బాలలు కార్మికులుగా మగ్గిపోతున్నారని తెలిపారు.

### నివేదికలో పేర్కొన్న మరిన్ని అంశాలివీ...

- ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాలకార్మికుల్లో 42 శాతం మంది అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు.
- 2004లో 22, 20 కోట్లుగా ఉన్న బాలకార్మికుల సంఖ్య 2008 నాటికి 21.50 కోట్లకు చేరింది.
- భారత్‌లో 44.5 కోట్లు, చైనాలో 34.8 కోట్లు, బంగ్లాదేశ్‌లో 6.4 కోట్లు, పాకిస్థాన్‌లో 7 కోట్ల మంది చిన్నారులున్నారు.
- ఇందులో బడిలో చేరని పిల్లల సంఖ్య భారత్, పాకిస్థాన్‌లోనే అత్యధికంగా ఉంది.
- మిగతా దేశాలకంటే పేదరిక నిర్మూలనపై దృష్టి సారించి, బాలకార్మికులను బడిబాట పట్టించడంలో చైనా ముందువరసలో ఉంది.
- భారత్‌లో విద్య కోసం పెద్దగా నిధులు వెచ్చించడం లేదు. జాతీయ సంపదలో కేవలం 3 శాతాన్ని మాత్రమే కేటాయిస్తున్నారు.
- భారత్‌లో అంతంత మాత్రం ఆర్థిక పరిస్థితి ఉన్న 37 కోట్ల మందిలో 23.6 కోట్ల మంది వ్యవసాయరంగంలోనే ఉన్నారు.
- భారత్‌లో 75 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నారు.
- దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మంది రైతులు అప్పుల్లో చికుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 82 శాతం మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ❍

# ఆర్థిక సంక్షోభం స్వయంకృతం

రాష్ట్రప్రభుత్వం ప్రస్తుతం ఆర్థికసంక్షోభంలో కూరుకుపోతుండటం పూర్తిగా స్వయంకృతాపరాధం.

ప్రజల్ని వారికాళ్ల మీద వారిని నిలబెట్టి, పేదరికాన్ని శాశ్వతంగా తొలగించి భావితరాలకు మంచి భవిష్యత్తునిచ్చే విధానాలనుకాకుండా, కేవలం తాత్కాలిక ఉపశమనాన్నిస్తూ ప్రజల్ని మభ్యపెట్టి ఓట్లు దండుకునే విధానాలనే 2004 నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తూ వచ్చింది. నిరుపేదలకు, అవకాశాలు అందనివారికి తక్షణసాయంగా సబ్సిడీలు, రాయితీలు అవసరం. అయితే అర్హులకు మాత్రమే సబ్సిడీలను పరిమితం చేయకుండా ఒక ఎన్నిక తర్వాత మరో ఎన్నిక మీదే దృష్టి పెట్టి విచక్షణారహితంగా విలువైన వనరుల్ని ఎడాపెడా వెదజల్లి 80శాతంకంటే ఎక్కువమందిని తాత్కాలికంగా సంతృప్తిపరిచే ప్రయత్నం చేసింది.

20 లక్షల కంటే ఎక్కువ బోగస్ లేదా అనర్హులకు రేషన్ కార్డులు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ సొంత సర్వేలోనే తేలింది. 17 లక్షల బోగస్ లేదా అనర్హ పెన్షన్‌దారులున్నట్టు తేలింది. ఇందిరమ్మ ఇళ్లలో లక్షలసంఖ్యలో బోగస్‌లు తేలటం చూస్తే నిధులు ఎంత విచక్షణారహితంగా దుర్వినియోగమయ్యాయో అర్థమవుతుంది. అర్హులకు అందకుండా అనేకమంది అనర్హులైన విద్యార్థులు ఫీజు రీఇంబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్పులు పొందుతున్నారని ఆలస్యంగా గుర్తించాక, ఇప్పుడు నిబంధనలను కట్టుదిట్టం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అలాగే విద్యుదుత్పత్తి, సరఫరాలో నాణ్యతను పెంచి గ్రామాలకు 24గంటలూ విద్యుత్‌నందించే ప్రయత్నం వదిలేసి, విద్యుత్ ఛార్జీలు చెల్లించగలిగిన రైతులకు కూడా ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. ఈ బాధ్యతారాహిత్యం వల్ల భారీగా నిధుల నష్టంతోపాటు ఈవేళ భూగర్భజలాలు ఇంకిపోయే ప్రమాదం తలెత్తింది. వ్యాధి నివారణ, ప్రాథమిక, ద్వితీయస్థాయి వైద్యాన్ని గాలికొదిలేసి కార్పొరేట్ ఆసుపత్రులకు మేలుచేసేలా వ్యాధి ముదిరాకదశలో ఆపరేషన్లకు కోట్లు కుమ్మరించే ఆరోగ్య పథకాన్ని అసంబద్ధంగా అమలుచేస్తోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న జలయజ్ఞంలో అంచనాల్ని విపరీతంగా పెంచి ప్రాజెక్టుల్ని కేటాయించింది. సాధ్యా సాధ్యాలను, వనరులను పరిగణనలోకి తీసుకోకుండా టెండర్లను పిలిచి, మొబిలైజేషన్ అడ్వాన్సుల్ని చెల్లించింది. మరోవైపు, ప్రజల డబ్బును పందికొక్కుల్లా మింగుతున్న రాజకీయ అవినీతిని నిర్మూలించే చర్యలు లేకుండా నిమ్మకునీరెత్తినట్టుగా చూస్తోంది.

అనూహ్య వ్యయంతో అసంబద్ధంగా తలపెట్టిన అనేక సాగునీటి ప్రాజెక్టుల అవసరాన్ని, సాధ్యాసాధ్యాల్ని నిగ్గుతేల్చేందుకు నిపుణులతో కూడిన కమిటీని వేయాలి. రాష్ట్రంలో జలయజ్ఞం పెనుభారం కాకుండా ప్రతి నీటిబొట్టు సద్వినియోగం చేసే ప్రత్యామ్నాయ విధానాల్ని రూపొందించాలి. "పథకాల ప్రాథమ్యాల్ని హేతుబద్ధంగా నిర్ణయించి అమలుచేయటంతోపాటు అవినీతిపరుల్ని, నల్లడబ్బువాలాల్ని, పన్నుఎగవేతదారుల్ని కఠినంగా నియంత్రించటం, గనులు వంటి రంగాల్లో పారదర్శక విధానాల్ని అమలుచేయటం ద్వారా ప్రభుత్వం ఆర్థికసంక్షోభం నుంచి బైటపడగలుగుతుంది, అభివృద్ధి కార్యక్రమాలకు కావలసిన పెట్టుబడులు కూడా సమకూరతాయి". అసంబద్ధంగా చేస్తున్న భారీ వ్యయం ఆదా అవటంతోపాటు దీర్ఘకాలంలో ప్రయోజనాన్నిచ్చే కొత్త వనరులు ఏర్పడతాయి.

**తొలినుంచీ చెబుతున్నాం... 2009 ఎన్నికల మేనిఫెస్టోలప్పుడూ నిలదీశాం**

విధానాల రూపకల్పనలో హేతుబద్ధతతో, విజ్ఞతతో, ముందుచూపుతో వ్యవహరించాలని లోక్‌సత్తా తొలినుంచీ చెబుతోంది. 2009 ఎన్నికల్లో అధికార పార్టీతోపాటు ప్రతిపక్షపార్టీలు కూడా పోటాపోటీ జనాకర్షక విధానాలను డబ్బును, భూమిని ఫ్యాక్టరీలలో తయారు చేసి పంచే రీతిలో ప్రకటించినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించాం.

"ఇది ప్రమాదకరమైన ధోరణి అని ఎన్నికల మేనిఫెస్టోల సమయంలోనే హెచ్చరించాం. ఆకలివేసిన మనిషి తన మాంసం తానే తినటం ఎంత ప్రమాదకరమో కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసం ఇచ్చే అలాంటి హామీలూ అంతే ప్రమాదకరం. ప్రజల్ని శాశ్వత బిచ్చగాళ్లుగా కొనసాగించే పథకాలకు లోక్‌సత్తా పూర్తిగా వ్యతిరేకం. నిరుపేదలకు, అవకాశాలు లేనివారికి తాత్కాలిక సాయం అందిస్తూనే, ఎటువంటి వివక్షలేకుండా అందరికీ నాణ్యమైన విద్య,ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాల్ని అందించటం, అవినీతిలేకుండా పౌరుని చుట్టూ పాలన జరిగేందుకు స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, నిధుల్ని ఇవ్వటం ద్వారా మాత్రమే పేదరికం శాశ్వతంగా తొలగి ప్రజలు ఆత్మగౌరవంతో తలెత్తుకుని బతకగలుగుతారు. ❍




# లక్ష్యసాధన కోసం ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం

- "ఆటగాళ్లు ఎవరన్నది ముఖ్యం కాదు... టీమిండియా గెలవటం ప్రధానం"
- దామాషా ఎన్నికల పద్ధతిని తెస్తేనే సరైన వ్యక్తులు రాజకీయాల్లోకి వస్తారు

**చికాగోలో జేపీ**

పీపుల్ ఫర్ లోక్‌సత్తా సంస్థ ఆధ్వర్యంలో చికాగోలో జరిగిన జేపీ సమావేశంలో.... చికాగోలో జేపీ సమావేశాల్లో పాల్గొని ఆయనతో ముఖాముఖి మాట్లాడేందుకు స్థానికంగా ఉండే ప్రవాస భారతీయులు పెద్దఎత్తున తరలివచ్చారు. చికాగో చారిత్రక ప్రాధాన్యతను, భారత పునరుజ్జీవనం కోసం అక్కడ వివేకానందుడు ఇచ్చిన పిలుపును ప్రస్తావించిన అనంతరం జేపీ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఆడిటోరియం నిండిపోవటంతో కొంతమంది నిలబడే ప్రసంగాల్ని విన్నారు.

లోక్‌సత్తా పార్టీకో, మరొకరికో మద్దతివ్వమని అడగటానికి తాను అమెరికాకు రాలేదని, భారతదేశంలో మార్పు తెచ్చేందుకు తోడ్పాటునందిస్తూ కలిసి పనిచేయాలని కోరటానికి మాత్రమే వచ్చానని జయప్రకాష్ నారాయణ అమెరికాలోని చికాగోలో ప్రవాస భారతీయులతో అన్నారు. లక్ష్యసాధన కోసం ఎవరితోనైనా కలిసి పనిచేయటానికి సిద్ధమేనని పునరుద్ఘాటించారు. "ఆటగాళ్లు ఎవరనేది ముఖ్యం కాదు. టీమిండియా గెలవటం ప్రధానం" అని స్పష్టంచేశారు.

భారత్‌లో ఏదో ఒక రకమైన మార్పు తప్పనిసరిగా వస్తుందని, అయితే సరైన మార్పును త్వరితగతిన తేవటం ఈవేళ మనముందున్న కర్తవ్యమని జేపీ పేర్కొన్నారు. రాజకీయ, పాలనా, ఎన్నికల వ్యవస్థల్ని ప్రక్షాళన చేయటం ద్వారా మార్పు సాధించటానికి కావలసిన మానవవనరులు, సాంకేతిక పరిజ్ఞానం మనకు పుష్కలంగా ఉన్నాయన్నారు. భారత్‌లో రాజకీయాలంటే వ్యాపారంగా, ఎన్నికలంటే ట్వంటీ-ట్వంటీ క్రికెట్ మ్యాచ్‌లో బెట్టింగుల్లా మారిపోయాయని, ఎన్నికల్లో ఒక సీటు గెలవటానికి రూ.50కోట్ల రూపాయల వరకూ చట్టవ్యతిరేకంగా ఖర్చు పెట్టే సంస్కృతి ఒక్క భారతదేశంలోనే కన్పిస్తుందన్నారు. మొదటి రాక్షసుడ్ని ఓడించి రెండో రాక్షసుడ్ని గద్దెనెక్కించే క్రీడగా మాత్రమే ఎక్కువమంది ఓటర్లు ఎన్నికల్ని చూస్తున్నారన్నారు. ఎన్నికలు దేశభవిష్యత్తు గురించి, మున్సిపాలిటీలలో పారిశుద్ధ్యం, రక్షిత మంచినీరు వంటి సేవలు అందటం గురించి, భావితరాలకు మంచి చదువును అందించటం గురించి, అవినీతిరహిత పాలన గురించి అనే దృక్పథంతో వ్యవహరించటం లేదన్నారు.

రాజకీయాలు అంత భ్రష్టుపట్టినా... సమగ్ర విధానాలతో, స్వచ్ఛమైన రాజకీయం చేస్తున్న లోక్‌సత్తాకు ప్రజలు ఎందుకు ఓట్లేయలేదని అదేదో తన తప్పయినట్టు కొందరు అడుగుతుంటారని జేపీ అన్నారు. "స్వచ్ఛమైన రాజకీయాలు సాధ్యమని చెప్పటం పాపమైతే, నేను చేసింది తప్పు. ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను నిర్మించటం పాపమైతే, నేను చేసింది తప్పు. లోక్‌సత్తా చెబుతున్న మార్గం ద్వారా కాకుండా ఇంకేదైనా మార్గం ద్వారా దేశం మారే అవకాశముండి చేయలేదంటే, నేను చేసింది తప్పు... దిక్కూచిలా దేశానికి సరైన దిశానిర్దేశం చేయటం, ప్రజలు రాజకీయాల్లో పాల్గొనేందుకు ఒక వేదికను అందించటం వరకే లోక్‌సత్తా పాత్ర" అని జేపీ స్పష్టంచేశారు. ఎవరో హీరోలు వచ్చి మారుస్తారని ఆశించకుండా సరైన రాజకీయ వ్యవస్థల్ని నిర్మించేందుకు అందరూ కలిసివస్తేనే పరిస్థితి మారుతుందన్నారు. ఈ లక్ష్యాలను ఏర్పరుచుకోగలమని, వాటిని సాధించుకునే పూర్తి అవకాశాలు మన చేతుల్లోనే ఉన్నాయని సామాన్య ప్రజల్లో చైతన్యాన్ని పెంచే కృషిలో ఎన్నారైలు కలిసిరావాలన్నారు.

ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే, తక్కువ వచ్చినా ఓడిపోయినట్టే అనే ఎన్నికల వ్యవస్థను మార్చి... ప్రతి ఓటుకూ

విలువ ఉండే, కనీస సంఖ్యలో ఓట్లు వచ్చినా అభ్యర్థి గెలవగలిగే దామాషా ఎన్నికల విధానాన్ని తెస్తే మధ్యతరగతివారు, మహిళలు, ఆలోచనాపరులు రాజకీయాల్లోకి వస్తారన్నారు.

మరోవైపు, ఎంత ఆర్థికాభివృద్ధిని నమోదుచేస్తున్నా, పుట్టిన కులం, మతం, కుటుంబ ఆర్థికస్థితిగతుల కారణంగా ఒక బిడ్డ భవిష్యత్తు నిర్ణయమయ్యే పరిస్థితులు ఉంటే, ఆ దేశం ఉన్నత లక్ష్యాలను సాధించలేదని, వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలున్న సమాజాన్ని సృష్టించటం ఈవేళ భారతదేశ అభివృద్ధికి ఎంతో అత్యవసరమన్నారు. సమాజంలో వివక్షను తొలగించి అందరికీ ఎదిగే అవకాశాల్ని కల్పించటంలో విద్య కీలకపాత్రను పోషిస్తుందని, నాణ్యమైన విద్యను అందించేలా విద్యారంగాన్ని తీర్చిదిద్దటం రాజకీయానికి, పాలనకు కేంద్రబిందువు కావాలని పేర్కొన్నారు. అయితే మనదేశంలో ప్రభుత్వ స్కూళ్లలో విద్య నానాటికీ నాసిరకంగా తయారవటం తీవ్ర ఆందోళనకర పరిణామమని జేపీ అన్నారు. మనకన్నా వెనకబడిన దేశాల్లో కూడా ఇలాంటి దుస్థితి లేదన్నారు. ప్రాథమిక, పాఠశాల విద్యను బలోపేతం చేయాల్సి ఉందని, సాంకేతికాభివృద్ధికి దోహదం చేసే విద్యను మనం గణనీయంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. “ఒకసారి పారిశ్రామిక విప్లవాన్ని కోల్పోయాం. అటువంటి అవకాశాన్ని మరోసారి జారవిడుచుకుంటే దేశం భారీమూల్యం చెల్లిస్తుంది” అని హెచ్చరించారు.

చికాగోలోని భారత కాన్సులేట్ పనితీరు తనకెంతో సంతోషాన్ని, గర్వాన్ని కలిగించిందని, మనదేశంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఆ కాన్సులేట్ ఆదర్శమని పేర్కొన్నారు. చికాగోలో విజయం సాధించగలిగిన భారతీయులు అదే నమూనాని భారత్‌లో కూడా సాధించగలరనటంలో సందేహం లేదన్నారు. నిజాయతీ రాజకీయాలకన్నా అవినీతి రాజకీయాలకు ప్రోత్సాహకరంగా ఉండే పరిస్థితులు మనదేశంలో నెలకొన్నాయని, ఈ పరిస్థితిని పూర్తిగా మార్చాలని అన్నారు. ప్రపంచంలోని అనేక నగరాలు అవినీతి జాడ్యంతో నలిగిపోయినవేనని, అయితే దృఢసంకల్పంతో పోరాడి అవినీతి ప్రక్షాళన సాధించాయని, ఈవేళ భారత్ కూడా ఆ బాటలో నడవాల్సి వుందని అన్నారు. అవినీతి రుజువైతే, అమెరికా, పశ్చిమ దేశాల సమాజాల్లోలా తీవ్రశిక్షల్ని భారత్‌లో కూడా అమలు చేయాల్సి ఉందన్నారు.

అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా తన కెరీర్‌ను వదులుకుని, తమిళనాడులో సామాజికసేవను నిర్వహిస్తూ ప్రస్తుతం ఆ రాష్ట్ర లోక్‌సత్తా పార్టీ విభాగానికి అధ్యక్షునిగా పనిచేస్తున్న విజయ్ ఆనంద్ మాట్లాడుతూ, అనేకమంది భారతీయ నేతలు ఒకప్పుడు ప్రవాస భారతీయులేనని గుర్తుచేశారు. విదేశాల నుంచి భారత్‌కు తిరిగొచ్చి దేశం కోసం పోరాడిన వారి బాటలోనే ఎన్నారైలు భారత్‌లో రాజకీయ ప్రక్షాళన కోసం కృషి చేయాలన్నారు. కేవలం ఆర్థికపరమైన తోడ్పాటు మాత్రమే కాకుండా ప్రత్యక్షంగా భారత్‌లోని రాజకీయాల్లో పాలుపంచుకోవాలని విజయ్ ఆనంద్ కోరారు. ❍

## పరిణతిగల నేత షెకావత్: లోక్‌సత్తా నివాళి



భారత మాజీ ఉపరాష్ట్రపతి భైరాన్‌సింగ్ షెకావత్ మృతి పట్ల లోక్‌సత్తా పార్టీ ప్రగాఢ సంతాపం తెలిపింది. అతి సామాన్య స్థాయి నుంచి ఉపరాష్ట్రపతి స్థాయి వరకూ తన పోరాటపటిమతో, పరిణతితో ఎదిగిన నాయకుడు భైరాన్‌సింగ్ షెకావత్

గ్రామీణ ప్రజలు, రైతుల పట్ల షెకావత్ ఎనలేని ఆపేక్షను కనబరిచేవారు. కడుపేదలకు ఆహారభద్రతను అందించేందుకు ఆయన రూపొందించిన ‘అంత్యోదయ’ పథకం అంతర్జాతీయస్థాయిలో ప్రశంసల్ని పొందింది. దేశంలో సంకీర్ణ రాజకీయాలు ఒడిదుడుకులు లేకుండా సాగటంలో ఆయన కీలకపాత్రను పోషించారు.

## తెలుగు భాషను, సమాజాన్ని సుసంపన్నం చేసే పాటలు రాసిన అక్షర రుషి – వేటూరి



శక్తివంతమైన సినిమా మాధ్యమంలో పాటల రచనను కేవలం వృత్తిగానో, ప్రవృత్తిగానో భావించకుండా తెలుగు భాషను, సమాజాన్ని సుసంపన్నం చేసే సాధనంగా ఉపయోగించిన కొద్దిమందిలో వేటూరి సుందరరామ్మూర్తి ఒకరు. తెలుగు పాట స్థాయి తగ్గకుండానే వైవిధ్యభరితమైన పాటల్ని సామాన్య జనరంజకంగా అందించారు.

“అంతః స్ఫూర్తితో అక్షర రుషిలా పాటలు రాశారు. అలాగే సీదాసాదాగా జీవించారు. ఆయన అకాలమరణం చెందకుండా ఉంటే, వయసుతో పాటు పెరిగే పరిపక్వతతో మరిన్ని ఆణిముత్యాల్ని కనీసం మరో పదేళ్లపాటు తెలుగువారికి అందించేవారు. ఆయన మృతి తెలుగు సినీపరిశ్రమకేకాదు, భాషకు కూడా లోటు”.

# తుఫాను బాధిత ప్రాంతాల్లో పర్యటించిన లోక్‌సత్తా రాష్ట్ర బృందం





లైలా తుఫానుతో తీవ్రంగా నష్టపోయిన ముంపు కాలనీల్లో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రతినిధి బృందం పర్యటించి, ఒంగోలు, అద్దంకి, చీరాలలలో వాటిల్లిన భారీనష్టాలను స్వయంగా పరిశీలించింది. తుఫాను ప్రభావానికి దెబ్బతిన్న గృహాలను, కుటుంబాలను సందర్శించి బృందం ఓదార్పునిచ్చింది. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కమిటీ నుంచి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి విజయేందర రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షులు ఎన్. శ్రీధర్, గుంటూరు జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డిలు జిల్లా అధ్యక్షులు అల్లు రమేష్ రెడ్డి లతో కూడిన బృందం స్థానిక జయప్రకాష్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, కళ్యాణినగర్ ప్రాంతాల్లో ముంపు కాలనీలకు వెళ్లి బాధితులతో మాట్లాడి సహాయ చర్యలను అడిగి తెలుసుకున్నారు. బృంద సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిందని, తుఫానును ఎదుర్కొనేందుకు శాశ్వత చర్యలు చేపట్టకపోవడం వల్ల భారీనష్టం సంభవించిందని ఆరోపించారు. జిల్లాలో చేతికందివచ్చిన పంటలు వరదకు కొట్టుకుపోయాయన్నారు. రాజకీయ లబ్ధికోసం తాత్కాలిక కార్యక్రమాలు చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టలేదని విమర్శించారు. నష్టం అంచనాలను స్పష్టంగా వేయాలని, ప్రతి బాధితుడికి నష్టపరిహారం అందించాలని కోరారు. లైలా బీభత్సంతో మృతిచెందిన కుటుంబాలకు రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా, కూలిన ఇళ్లకు శాశ్వత గృహాలు, నెలరోజులపాటు నిత్యావసరాలు ప్రభుత్వం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు అల్లు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవటంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. మంత్రి బాలినేని శ్రీనివాసుల రెడ్డి ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఉన్న ఒంగోలు తీవ్రంగా దెబ్బతింటే ప్రజలకు సహాయం చేయకపోవడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. నష్టపోయిన ఒక కాలనీని తమ పార్టీ దత్తత తీసుకుని సహాయక చర్యలు చేపడుతుందని ప్రకటించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సి. హెచ్. రత్నకుమారి, సంయుక్త కార్యదర్శి వర్ధన్, మహిళా అధ్యక్షులు శారద, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు ఎన్. రాధాదేవి, అద్దంకి, దర్శి నియోజకవర్గాల అధ్యక్షులు సాంబశివరావు, శ్రీనివాసరావు గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి పార్టీ కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు. అనంతరం 500 కుటుంబాలకు దుప్పట్లు, ఆహార పొట్లాలు, బిస్కెట్ ప్యాకెట్లు మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు.

## బాధితుల్ని ఆదుకున్న లోక్‌సత్తా

లోక్‌సత్తా ప్రకాశం జిల్లా విభాగం తరుపున స్థానికంగా ఒక బృందం సహాయ చర్యల్లో పాల్గొంది. ముంపునకు గురైన కొన్ని కాలనీల్లో ఆహారపొట్లాలను అందించటంతోపాటు పునరావాస కేంద్రాల్ని సందర్శించి బాధితులకు సాయం సక్రమంగా అందేలా ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేశారు. వారితో పాటు ఇద్దరు డాక్టర్లతో కూడిన ఒక వైద్యబృందం కూడా పనిచేసింది. రాష్ట్రస్థాయి బృందం కూడా వెళ్లి బాధితులకు దుప్పట్లు, మందులు తదితర సాయం అందించటంతోపాటు పరిస్థితిని అంచనా వేసి, రాష్ట్రస్థాయి నుంచి ఇంకా చేయగలిగిన సహాయచర్యల్ని నిర్ణయించి వెంటనే ఏర్పాట్లు చేయడం జరిగింది.

## రైతుల్ని ఆదుకోవాలి

తీవ్ర ప్రతికూల పరిస్థితుల మధ్య పండించుకున్న పంటను నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. కోస్తా జిల్లాల్లోని చాలా చోట్ల కళ్లాల్లోనే వరి ధాన్యం వర్షార్పణమైంది. కొన్ని చోట్ల వరికుప్పలు కూడా నీటమునిగాయి. తడిసిన ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వమే ముందుకు రావాలి. గత అనుభవాల దృష్ట్యా రైతుల్లో తీవ్ర అభద్రత నెలకొంది. గిట్టుబాటు ధరకే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సర్కారు హామీ ఇవ్వాలి. ధాన్యంతోపాటు దెబ్బతిన్న మామిడి, అరటి, తమలపాకు, జీడి మామిడి రైతులను, మత్స్యకారులను ఆదుకునేందుకు వెంటనే ఏర్పాట్లు చేయాలి. అంచనాల పేరుతో తాత్సారం తగదు.

తుఫాను పట్ల ముందు జాగ్రత్తల విషయంలో రాష్ట్రప్రభుత్వానికి పూర్తిగా సహకరించిన భారత ప్రభుత్వం... సాయం అందించటంలో కూడా ఉదారంగా వ్యవహరించాలి. గత ఏడాది అక్టోబర్‌లో వరదలకు ప్రకటించిన సాయం ఇప్పటికీ పూర్తిగా అందలేదు. అలాంటి అలసత్వాన్ని ఇక మీదట ప్రదర్శించకూడదు. ❍

# అవినీతి నిరోధక చట్టాన్ని సవరించటం తక్షణావసరం

హైదరాబాద్‌లో జరిగిన తాజా మహానాడులో రాజకీయ నాయకుల అక్రమ ఆస్తులను జప్తుచేసేలా రాష్ట్రప్రభుత్వం, భారత ప్రభుత్వం చట్టం చేయాలని టీడీపీ తీర్మానం చేయటం హర్షణీయం.

అవినీతి నిరోధక చట్టాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేలా సవరణలతో ముసాయిదా బిల్లును రూపొందించి, ఆ బిల్లును శాసనసభలోని అన్ని పార్టీలకూ అందచేయటంతోపాటు, చట్టం చేసేందుకు ప్రభుత్వం ముందుకురాకపోతే ప్రతిపక్షాలన్నిటితో సమావేశానికి చొరవ తీసుకోవాలని, అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టాలని టీడీపీ అధ్యక్షుడు ఎన్. చంద్రబాబు నాయుడుని లోక్‌సత్తా పార్టీ ఇప్పటికే కోరింది. ఏసీబీ (అవినీతి నిరోధక విభాగం) లో ఉన్నతాధికారులను నియమించటంలో బిల్లులో ప్రధాన ప్రతిపక్షనేతకు కీలకపాత్ర ఉంది.

ముఖ్యమంత్రి రోశయ్య అవినీతి సమస్యను పార్టీలకతీతంగా చూడాలి. "అవినీతి నిర్మూలనకు అవసరమైన వ్యవస్థల్ని నిర్మించాలి. అక్రమాలపై, అవినీతిపై కఠినచర్యలు తీసుకోవాలి. అవినీతిపరుల గుండెల్లో నిద్రపోవాలి" అని ఇటీవల సిఎం రోశయ్య ఏసీబీకి పిలుపునిచ్చారు. దీన్ని ఆచరణలో కనబరచటానికి కావలసిన సంకల్పాన్ని ప్రదర్శించాలి. అందుకోసం అవినీతి నిరోధక చట్టాన్ని సవరించేందుకు రోశయ్య చొరవ చూపాలి.

లోక్‌సత్తా రూపొందించిన బిల్లు అమలులోకి వస్తే, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో, మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికైన ప్రతినిధులు ప్రజాసేవకుల పరిధిలోకి వస్తారు. అవినీతి నిరోధక శాఖ నిబంధనలన్నీ వారికి కూడా వర్తిస్తాయి. విచారణ సమయంలో ఆస్తుల్ని స్వాధీనం చేసుకునే అవకాశం ఈ బిల్లు కల్పించింది. ఒకవేళ నేరం రుజువైతే ఆస్తుల్ని జప్తు చేస్తారు.

ప్రతి జిల్లాలో ఒక ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయటం, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లను నియమించటం, ఏసీబీకి స్వయంప్రతిపత్తి కల్పించటం, లోకాయుక్తకు గట్టి అధికారాలివ్వటం... బిల్లులోని ఇతర ముఖ్యాంశాలు. ప్రజాసేవకులపై అవినీతి ఆరోపణల మీద ప్రత్యేక కోర్టులు తమంతటతాముగా విచారణ చేపట్టవచ్చు.

అవినీతి అనివార్యం, దాని మీద పోరాటం వృధా ప్రయాస అనే స్థాయిలో ఈవేళ అవినీతి వేళ్లానుకుపోయింది. మన ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే స్థాయిలో ఆ నిర్లిప్తధోరణి పెరిగిపోతోంది. "ప్రపంచంలో ఎక్కడాలేని రీతిలో మన దేశంలో, సమాజంలో అవినీతి ఓ ఆనవాయితీగా ఉందనుకోవటం అర్థరహితం. అవినీతికి పాల్పడితే ఎంతటివారి మీదైనా చర్య తీసుకునే చట్టాన్ని అమలుచేయటంతోపాటు పోటీ, ఎంపిక అవకాశాలు ఉండే వ్యవస్థల్ని నిర్మించటంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శకతను అందుబాటులోకి తెస్తే అవినీతిని దాదాపుగా నిర్మూలించవచ్చు. అవి చేయాలంటే మనకు కావలసిందల్లా రాజకీయ సంకల్పం". ❍

## మంత్రిపై విజిలెన్స్ విచారణతో నిజాలు తేలవు

**ముఖ్యమంత్రికి లోక్‌సత్తా డిమాండ్**

- **చిత్తశుద్ధి ఉంటే స్వయంప్రతిపత్తి, అధికారాలు ఉన్న అంబుడ్స్‌మెన్‌ను వేయండి**

"రాష్ట్ర కేబినెట్ మంత్రిశ్రీ ధర్మాన ప్రసాదరావు పై, ఆయన సొంత జిల్లాలో వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విభాగం విచారణకు ముఖ్యమంత్రి రోశయ్య ఆదేశాలివ్వటం చెప్పుకోవటానికేతప్ప పెద్దగా ఫలితం ఉండదు. కోరలు లేని సంస్థలతో ఉత్తుత్తి విచారణలు ప్రజల్ని మభ్యపెట్టటమే. ఉపాధి హామీ పథకంలో అక్రమాలను నిగ్గుతేల్చి ప్రజాధనాన్ని పరిరక్షించాలని సీఎంకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పక్కా అధికారాలున్న అంబుడ్స్‌మెన్‌ను వేయాలి".

ఉపాధి హామీలో అవకతవకలు కేవలం శ్రీకాకుళం జిల్లాకే పరిమితం కాదు. విచారణను కేవలం ఒక జిల్లాకు, ఒక నియోజకవర్గానికి పరిమితం చేయటం వల్ల అవినీతి సమస్య తీవ్రతను తగ్గించటమే. విజయనగరం, తూర్పు గోదావరి, అనంతపురం వంటి జిల్లాల్లో విచ్చలవిడిగా అవకతవకలు జరిగాయని ప్రాథమిక సాక్ష్యాలు రుజువుచేస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రయివేటు ఆడిట్ల ప్రకారం చూసినా అనేక జిల్లాల్లో అక్రమాల చిట్టా ఉంది.

రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) అమలులో అవకతవకల మీద నిష్పాక్షిక విచారణకు, దోషులపై తగిన చర్యలు తీసుకునేందుకు పూర్తి అధికారాలు, స్వయంప్రతిపత్తి ఉన్న అంబుడ్స్‌మెన్‌ను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలి.

# భారతదేశ భవిష్యత్తుకు అత్యుత్తమ గ్యారంటీ ప్రజలే

- మంత్రులు, ఐఏఎస్‌ల నుంచి 'జనం చేతికి అధికారమివ్వటమే' అంతిమ పరిష్కారం
- కలిసి పనిచేద్దాం రండి అని ఎన్నారైలకు జయప్రకాష్ నారాయణ్ ఆహ్వానం
- అమెరికా బే ఏరియాలో జేపీ సభకు భారీ స్పందన

పీపుల్ ఫర్ లోక్‌సత్తా సంస్థ ఆధ్వర్యంలో బే ఏరియా, లాస్‌ఏంజిల్స్‌లో జేపీ సమావేశాల్లో ప్రసంగించారు. భారతదేశ భవిష్యత్తుకు అత్యుత్తమ గ్యారంటీ ప్రజలే. సరైన వ్యవస్థల్ని నిర్మించి జనం చేతికి అధికారమిస్తే మనదేశ భవిష్యత్తుకు ఢోకా ఉండదు. అధికారం ఢిల్లీలోనో, హైదరాబాద్‌లోనో, మంత్రుల చేతిలోనో, ఐఏఎస్ అధికారుల చేతిలోనో ఉంటే గందరగోళం, అవినీతి తప్ప అభివృద్ధి సాధ్యంకాదు. జవాబుదారీతనంగల స్థానిక ప్రభుత్వాలను నిర్మించటమే మంచిపాలనకు సరైన మార్గం. ఈ వాస్తవాన్ని మనకంటే త్వరితంగా పొరుగున ఉన్న చైనా దేశం గుర్తించింది. మనదేశంలో కంటే ఎక్కువగా అక్కడ అధికార వికేంద్రీకరణ జరిగింది, మనం మేలుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

బే ఏరియా (కాలిఫోర్నియా రాష్ట్రం) లో జరిగిన జేపీ సమావేశానికి ఎన్నారైల నుంచి అద్భుత స్పందన లభించింది. 1200మందికి పైగా హాజరవటంతో సభాస్థలి ఖాళీలేక కొంతమంది తిరిగి వెళ్లిపోవటం కన్పించింది. ఇంత పెద్దఎత్తున ఓ రాజకీయ కార్యక్రమానికి ఇక్కడ ఎన్నారైలు హాజరుకావటం ఇదే తొలిసారి అని పలువురు పేర్కొన్నారు.

గత 15రోజులుగా అమెరికాలోని వివిధ నగరాల్లో పర్యటిస్తూ సమావేశాల్లో పాల్గొంటున్న మాతృదేశాన్ని బాగు చేయాలని ఇక్కడి భారతీయ సంతతివారిలో కనిపిస్తున్న తపన ఎంతో స్ఫూర్తినిస్తోంది. ఆ తపన బే ఏరియా సమావేశానికి ఓ ఉద్యమస్థాయికి చేరుకుంది. దీన్ని నిర్మాణాత్మకంగా మలుచుకోవాలి. స్వాతంత్ర్య సమరకాలంలో ఇదే తరహాలో విదేశాల్లో ప్రవాసభారతీయులు ఓ వేదికగా ఏర్పడి ఉద్యమంలా స్వదేశానికి తోడ్పాటునందించారు. "అదేతీరుగా ఇప్పుడు కూడా భారతదేశం మన లక్ష్యం కావాలి. భారతదేశ చరిత్రకు, నాగరికతకు తగ్గ ఉన్నతస్థాయిని ఎప్పుడో కాకుండా సమీప భవిష్యత్తులోనే నిర్మించే బాధ్యత మనందరి మీదా ఉంది". 18వ శతాబ్దంలో ప్రపంచ జీడీపీలో భారత్‌కు 25శాతం ఉండేది. ఆ తర్వాత పారిశ్రామిక విప్లవాన్ని కోల్పోవటం వల్ల అది 1శాతానికి పడిపోయింది. తిరిగి 1991 తర్వాత అంకితభావం వల్ల కాకపోయినా అనివార్య పరిస్థితులతో చేపట్టిన చర్యల వల్ల 2శాతానికి పెరిగింది. భారత్ వెలిగిపోతుందని చాటుకుంటున్నప్పుడు కూడా మన జీడీపీ 2శాతమే మనం నిజంగా వెలిగిపోవాలంటే ప్రపంచ జీడీపీలో 15శాతాన్ని సాధించాలి. అందుకు సరైన రాజకీయ వ్యవస్థల్ని నిర్మించటం, పాలనావ్యవస్థల్ని ప్రక్షాళన చేయటమే మార్గం. 2039నాటికల్లా దేశాన్ని బలమైన ఆర్థికశక్తిగా రూపుదిద్దేందుకు గట్టి పునాది వేయాల్సిన బాధ్యత మనమీదే ఉంది. ఇందుకోసం ఎంతో నిర్మాణ కార్యక్రమం చేయాల్సి ఉంది.

"మొదటగా, భిన్నత్వాన్ని ఓ బలంగా మార్చే రాజకీయాన్ని తీసుకురావాలి. భారత్‌లో ఇప్పుడు నడుస్తున్న రాజకీయం దేశంలోని భిన్నత్వాన్ని ఓ బలహీనతగా మార్చే ప్రయత్నం చేస్తోంది. డబ్బు వెదజల్లటం, ఉచితాల పేరుతో తాత్కాలిక తాయిలాల్ని ఇవ్వటం, ప్రజల్ని కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో విడగొట్టటమే వారి రాజకీయ సంస్కృతి. ఆ రాజకీయ సంస్కృతిని మార్చి భిన్నత్వాన్ని తిరిగి ఓ బలంగా మార్చే దిశగా రాజకీయం చేయాల్సి ఉంది. ఐక్యంగా వ్యవహరించగల శక్తిని, పరస్పర సంఘర్షణల్ని సామరస్యంగా పరిష్కరించుకుంటూ రాజ్యాంగబద్ధంగా, రాజ్యాంగస్ఫూర్తితో వ్యవహరించే శక్తిని భారత్ అలవర్చుకునేందుకు కృషి చేయాలి. రాజకీయాల పట్ల మౌనంగా ఉంటున్న మధ్యతరగతిని ఓ శక్తిగా మలిచి రాజకీయ ప్రక్రియలో వారిని భాగస్వాముల్ని చేయాలి. మహాత్మాగాంధీ, నెల్సన్ మండేలా, ఆంగ్‌సాన్ సూకీ తరహా రాజకీయాల వైపు వారిని నడిపించాల్సి ఉంది. అభిప్రాయ భేదాలను, స్వల్ప స్పర్థలను అధిగమించి మధ్యతరగతివారు రాజకీయాల్లో చురుకైన పాత్రను పోషించేలా చేయాలి. దాంతోపాటు స్థానిక ప్రజల్ని భాగస్వాముల్ని చేయాలి, యువతకు శిక్షణనివ్వాలి, నాయకుల్ని తయారుచేయాలి. ఈ బృహత్తర కార్యానికి ప్రవాస భారతీయులుగా మీరంతా మీ ప్రతిభాసామర్థ్యాలను, వనరుల్ని, భాగస్వామ్యాన్ని, నాయకత్వాన్ని అందించాలి".

సమావేశంలో పాల్గొన్న లోక్‌సత్తా పార్టీ తమిళనాడు విభాగం అధ్యక్షుడు విజయ్ ఆనంద్ కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్‌ల్లో పార్టీ పటిష్టతకు చేపడుతున్న చర్యల్ని వివరించారు. బే ఏరియాకు ముందు స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థిబృందం సమావేశంలో, గూగుల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన చర్చావేదికలో జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. ❍

హిందూ-ముస్లిం, తెలుగు-కన్నడ, రెడ్డి-కమ్మ వగైరాల పై

# అతివాద ధోరణుల్ని విడనాడండి

**భారతీయులుగానే సామరస్యంగా సమస్యల్ని పరిష్కరించుకుందాం**

**సియాటెల్, మౌంటెన్ వ్యూలో ఎన్నారైలకు జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి**

పీపుల్ ఫర్ లోక్‌సత్తా (పీఎఫ్ఎల్) సంస్థ నిర్వహిస్తున్న 'భారత్‌కు నూతనోత్తేజం' కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలో పర్యటిస్తున్న జయప్రకాష్ నారాయణ్... సియాటెల్ (వాషింగ్టన్ రాష్ట్రం), మౌంటెన్ వ్యూ (కాలిఫోర్నియా రాష్ట్రం)లో పాల్గొన్న సమావేశంలో....

ప్రవాస భారతీయుల్ని ప్రపంచమంతా భారతీయులుగానే గుర్తించి, గౌరవిస్తోంది దక్షిణాదివాళ్లు-ఉత్తరాదివాళ్లుగా, హిందువులు-ముస్లింలు, తెలుగువాళ్లు-కన్నడిగులు, రెడ్డిలు-కమ్మ కులస్తులుగా మాత్రం కాదని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. "దయచేసి ఈ వాస్తవాన్ని ఏరోజూ విస్మరించవద్దు".

కులం, మతం, ప్రాంతం, భాషకు సంబంధించిన అంశాలపై కొందరు ఎన్నారైలు బాధ్యతారహితంగా, అతివాద ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. "మన మధ్య విభేదాలను సామరస్యంగా పరిష్కరించుకోవటమే నాగరికత, ప్రజాస్వామ్యం" అని స్పష్టంచేశారు.

భారత్‌లో తాము ఆశించిన మార్పునకు సమయం పడుతోందని భారతీయులు నిరాశ చెందవద్దు. "మనకు సాంకేతిక పరిజ్ఞానం, వనరులు పుష్కలంగా ఉన్నాయి. భారతదేశాన్ని 10ఏళ్లలో మార్చగలం. 100ఏళ్లు అక్కర్లేదు". భారతదేశాన్ని 10ఏళ్లలో మార్చటానికి ఎన్నారైలు కొంత సమయం, వనరులు, సాంకేతిక, సంస్థాగత నైపుణ్యాల్ని, సామర్థ్యాల్ని, దేశం పట్ల తమ తపనను, ప్రేమను అందిస్తే చాలు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అలా తీసి ఇలా మార్పిడి చేయవచ్చు కానీ వ్యవస్థీకృత మార్పుల్ని అలా వెంటనే తెచ్చేయటం సాధ్యం కాదు. "రాజకీయ సంస్కరణల్ని తేవటం అత్యంత కష్టమైన కార్యం. అందుకు ఎనలేని ఓర్పు కావాలి".

ఎన్నారై యువతలోని ఉత్సాహం ఎంతో స్ఫూర్తినిస్తోంది. వచ్చే కొన్నేళ్లలో భారతదేశంలో మనం ఆశించిన మార్పు వస్తుందా లేదా అని ఎవరికైనా సందేహం ఉంటే, అమెరికాలోని భారతీయ సంతతి యువతను చూడాలి.

2009 అసెంబ్లీ ఎన్నికల్లో రూ. 25కోట్లు ఖర్చుపెట్టినా ఓడిపోయానని ఓ సంప్రదాయ పార్టీకి చెందిన రాజకీయనేత స్వయంగా చెప్పాడు. ఇటీవల బ్రిటన్‌లో జరిగిన ఎన్నికల్లో అన్ని పార్టీలూ కలిపి 50 మిలియన్ పౌండ్లు, అంటే దాదాపు రూ. 360కోట్లు ఖర్చు చేస్తే... ఆంధ్రప్రదేశ్‌లోని పెద్ద రాజకీయపార్టీలు ఒక్కొక్కటీ అంతకు మూడు, నాలుగు రెట్లు ఖర్చు చేశాయి. అంతకంటే పిచ్చితనం, వెర్రితనం ఇంకోటి లేదు. శాసనసభకు ఎన్నిక కావటానికి ప్రపంచంలో ఎక్కడా రాజకీయ నేతలు అంత పెద్దఎత్తున చట్టవిరుద్ధంగా డబ్బు ఖర్చు చేయటంలేదు. ఎన్నికల్లో రూ.25కోట్లు ఖర్చుపెట్టే వ్యక్తి ఎన్నికైతే రూ.500కోట్లు ఆర్జించే జాక్‌పాట్ కొడతాడు.

భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రధానమంత్రి నుంచి దిగువస్థాయి వరకు అందరికీ తెలుసు, కానీ తక్షణం, మనమే వాటిని పరిష్కరించగలమని ఎవ్వరూ అనటం లేదు. యధాతథ స్థితిని బద్దలుకొట్టి, జడత్వాన్ని వదిలించుకుని మార్పు కోసం మన ప్రయత్నాన్ని వెంటనే ప్రారంభించాలి. విస్పష్టంగా వెలుగొందే హేతువు ప్రవాహం... అలవాటు అనే జడత్వ ఎడారిలో ఇంకిపోకూడదని అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ మాటల్ని మనం గుర్తుకు తెచ్చుకోవాలి.

## రూ.2,000కోట్లు అక్కర్లేదు... 10,000 మంది నాయకులు కావాలి

ఎంత గొప్పవాడైనా, విలువైనవాడైనా ఒక వ్యక్తి పోరాటం ద్వారా మార్పు రాదు. అధికారాన్ని వికేంద్రీకరించి గ్రామస్వరాజ్యం తేవాలని, అవినీతిరహిత దేశాన్ని నిర్మించాలని మహాత్మాగాంధీ ఎంత పోరాడినా మిగిలినదేశమంతా ఆయనతో కలిసిరాకపోవటం వల్ల విఫలమయ్యాడు. అందరూ కలిసికట్టుగా పోరాడితేనే మార్పు సాధ్యం. వాటంతటవి సక్రమంగా పనిచేసే రాజకీయ వ్యవస్థల్ని నిర్మించటం ద్వారా భారతదేశ భవిష్యత్తు కోసం లోక్‌సత్తా పోరాడుతోంది. స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, వివక్ష లేకుండా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, పోలీసు, న్యాయ, ఎన్నికల సంస్కరణలు, అవినీతి నిర్మూలన లక్ష్యాలుగా పనిచేస్తోంది. ఈ కృషిలో అందరూ భాగస్వాములు కావాలి.

"మీకు రూ.2,000కోట్లు ఇస్తే ప్రస్తుత రాజకీయాల్ని ఎలా మారుస్తారు" అని ఒకరు ప్రశ్నించారు. "దేశాన్ని మార్చటానికి నాకు అద్భుత నాయకత్వ నైపుణ్యాలు ఉన్న 10,000మంది వ్యక్తులు కావాలి తప్ప, రూ.2000కోట్లు అక్కర్లేదు" అని జేపీ ప్రసంగించారు.

అంతకుముందు మాట్లాడిన లోక్‌సత్తా పార్టీ తమిళనాడు విభాగం అధ్యక్షుడు విజయ్ ఆనంద్ 'భారత్‌కు పునరుత్తేజం' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు పీపుల్ ఫర్ లోక్‌సత్తా కార్యకర్తల్ని అభినందించారు. ❍

### కీలక ప్రజాసమస్యల్ని వదిలేసి...

# జగన్ పర్యటనపై అంత చర్చ అవసరమా ?

- **దేశంలో ఎవరికైనా, ఎక్కడికైనా వెళ్ళే హక్కుంది. కానీ రాజకీయాలు, ప్రజా జీవనంలో ఉన్నవాళ్ళు సందర్భాన్ని, సమయాన్ని, ఉచితానుచితాలను గమనించాలి. కవ్వింపు చర్యలకు పాల్పడకూడదు. పరిస్థితిని జటిలం చేసేలా ఉండకూడదు. - అన్నివర్గాలూ బాధ్యతతో వ్యవహరించాలని లోక్‌సత్తా విజ్ఞప్తి**

కాంగ్రెస్ ఎంపీ వైఎస్ జగన్ వరంగల్ జిల్లాలో చేపట్టిన పర్యటనపై మితిమీరిన చర్చ జరిగింది. ఒక భారతీయ పౌరునిగా దేశంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు, స్వేచ్ఛ ఆయనకుంది. ఒకే దేశం–ఒకే ప్రజ ఉండే భారత్‌లో స్వేచ్ఛగా పర్యటించటానికి జగన్‌కో, టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కో ఎవరూ వీసాలు ఇవ్వనక్కర్లేదు.

"కేసీఆర్‌ను విజయవాడలో అడ్డుకుంటాం, జగన్‌ను వరంగల్‌లోకి రానివ్వం, ఇంకొకరిని కడపలో తిరగనివ్వం అనే అధికారం ఎవరికీ లేదు. వారు స్వేచ్ఛగా ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ చట్టబద్ధంగా అన్ని కార్యకలాపాలూ నిర్వహించుకోవచ్చు. పౌరులకు కనీస గ్యారంటీగా రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కు మీద ఈ విధమైన చర్చ చేయాల్సిన పరిస్థితి మన రాజకీయానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు అంత క్షేమకరం కాదు".



తన తండ్రి అకాల మరణంతో దిగ్భ్రాంతికి గురై మరణించినవారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చేందుకు వరంగల్ వెళ్ళానని జగన్ చెబుతున్నారు. దాని మీద అంత దుమారం లేవనెత్తాల్సిన అవసరమేమీ లేదు. ఆ అంశాన్ని అతిగా చర్చించి రగడగా మార్చటం వల్ల కొంతమంది స్వార్థ ప్రయోజనాలు నెరవేరతాయోమోగానీ ప్రజలకు మాత్రం ఒరిగేదేమీ ఉండదు. ఒక లక్ష్యం కోసం చేసే పోరాటం ఎప్పుడూ మన విధానాల బలం మీద ఉండాలి తప్ప ఎదుటివారి పట్ల ద్వేషాన్ని పెంచటంలో ఉండదని ఆయావర్గాలు గుర్తించాలి. జగన్ భావాలను లేదా విధానాలను విభేదిస్తే ఆయన పర్యటనకు హాజరుకాకుండా వదిలేస్తే సరిపోతుంది. వ్యతిరేకత ఉంటే ప్రజలు కూడా పట్టించుకోరు. జగన్ యాత్ర జరిగినా ప్రభావం లేదని చెప్పగలిగితే అది అసలైన ప్రజాస్వామిక విజయమయ్యేది. దానికి బదులు రావొద్దని హుకుంలు, హెచ్చరికల వల్ల ప్రజాసమస్యలు పక్కదోవపట్టి అల్పమైన అంశాలకు అదనపు ప్రచారం లభిస్తుంది. ధాన్యంకు మద్దతు ధరలేకపోవటం, తడిసిన ధాన్యం కొనుగోలు సమస్య, ఇటీవల తుపాను తాకిడికి గురై ఇంకా తేరుకోని వేలాదిమంది, ఓటరు కార్డుల నమోదు, మంచినీటి ఎద్దడి, పెద్ద ఎత్తున అవినీతి వంటి ప్రజలకు సంబంధించిన అనేక తీవ్రస్థాయి సమస్యల్ని వదిలేసి ఓ సాధారణ అంశాన్ని అంత చర్చనీయాంశం చేయటం తగదు. ఈవేళ అనవసర రాద్ధాంతం వల్ల ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టినట్లయింది. కాంగ్రెస్‌పార్టీలో వర్గ విభేదాలకు, అతివాద రాజకీయాలకు సామాన్య ప్రజలు మూల్యం చెల్లించటం విచారకరం.

వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ఎంపీ వైఎస్ జగన్ ఓదార్పు యాత్ర క్రమంలో చెలరేగిన హింస వల్ల అమాయక ప్రజలు ఇబ్బందిపడటం విచారకరం. ఇది పూర్తిగా నివారించదగ్గది. వీరిని అడ్డుకునే అధికారం ఎవరికీ లేదు. వరంగల్ జిల్లాలో జగన్ పర్యటనను అడ్డుకోవటానికి ఆందోళనకారులు హింసకు పాల్పడటం పూర్తిగా అప్రజాస్వామికం. "ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన నేతలు రాజకీయాన్ని అధికార క్రీడగా, రాజ్యాంగాన్ని కేవలం అధికారాన్నిచ్చే సాధనంగా భావిస్తూ విశృంఖలంగా వ్యవహరిస్తుండటం వల్లే ఇలాంటి విద్వేషపూరిత పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఆయా నేతలే ఇందుకు బాధ్యత వహించాలి".

మరోవైపు, సామాన్య ప్రజలు ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని జగన్ కూడా పర్యటనను వాయిదా వేసుకున్నా లేక పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం పరిస్థితిని అంచనావేసి నిక్కచ్చిగా వ్యవహరించి ముందు జాగ్రత్తలు తీసుకున్నా పరిస్థితి ఇంతవరకూ వచ్చేది కాదు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ఆందోళనకారులు గుమిగూడకుండా నివారించటంలో పోలీసులు జాగ్రత్తలు తీసుకోకపోవటం ఆశ్చర్యకరంగా ఉంది. ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి దోషుల్ని కఠినంగా శిక్షించాలి.

ప్రజల పట్ల వీసమెత్తు బాధ్యత ఉన్నా నేతలు ప్రజల్ని రెచ్చగొట్టకుండా ఇకనైనా సంయమనం పాటించాలి. ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు కూడా విజ్ఞతతో వ్యవహరించి సామరస్య వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషిచేయాలి. ❍

# నాయకత్వం - సమాచార పంపిణీ

- కొంగర గంగాధర రావు

**అంతర వ్యక్తిక సమాచార పంపిణి (Interpersonal Communication) ప్రభావంతో లక్ష్యాన్ని సాధించడమే నాయకత్వం.**

కార్యసాధనకు ప్రాధాన్యం వహించే అంశాలతో సమాచార పంపిణీకి ఎంతో ప్రాధాన్యం ఉంది. "ఒక వ్యక్తి మనసులో అవగాహన కల్పించాలనుకొన్నప్పుడు మరొక వ్యక్తి చేసే అన్ని విషయాల సమాహారమే" సమాచార పంపిణీ లేదా కమ్యూనికేషన్. ఇందులో చెప్పే వినే, అవగాహన చేసుకొనే ప్రక్రియ క్రమబద్ధంగా, నిరంతరాయంగా వుంటుంది.

మానవులుగా మన అంతర వ్యక్తిక అవసరాల కలయిక (inclusion), నియంత్రణ (Control ) వాత్సల్యం (affection) .

- ఇతరులతో గుర్తింపును పొందే అవసరమే **'కలయిక'.**
- నాయకత్వం చెలాయించడంతో పాటు సామర్థ్యాలను రుజువు చేసుకునే అవసరమే **'నియంత్రణ'.**
- వ్యక్తులతో సంబంధాలను పెంచుకునే అవసరమే **'వాత్సల్యం'.**

స్నేహితులను సంపాదించుకోవడానికి ఉత్తమ విధానమే సమూహాలు. సమర్థులైన నాయకులు కొన్ని పోలికలను కలిగి వుంటారు. సరైన సందర్భంలో ఉపయోగించిన కొన్ని పదాలు, జట్టు సభ్యులకు ప్రేరణ కల్పించి ప్రభావితం చేస్తాయి. తద్వారా నాయకుడి 'నాయకత్వ లక్షణాన్ని' పటిష్టం చేస్తాయి.

సమాచార పంపిణీలో నాయకులు స్వచ్ఛమయిన మనసుతో అనుచరులు చెప్పేది వినడానికి సుముఖంగా వుండాలి. **విశ్వాసాన్ని పెంపొందించడానికీ, నిష్కపటమైన వాతావరణాన్ని ఏర్పరచడానికీ ద్వి-విధ(ఒక-ఇంకా) సమాచార పంపిణీ కీలకమైనది.** నాయకుని నుండి జట్టు సభ్యులకు, జట్టు సభ్యుల నుండి నాయకునికి సమాచార పంపిణీ వుండాలి. కష్టపడి పనిచేసే విధంగా జట్టును ప్రేరేపించడంలో నాయకుని సమాచార పంపిణీ తీరు ముఖ్యమైనది. ఈ సమాచార పంపిణీలు ఊర్ధ్వ దిశగా, అధోదిశగా, పార్శ్వదిశగా వుంటాయి.

**ఊర్ధ్వదిశ సమాచార పంపిణీ:** కార్యకర్తల నుండి నాయకునికి అందే ఫీడ్‌బ్యాక్ (Feed back) ఊర్ధ్వదిశ పంపిణీ అంటారు. ఈ ఊర్ధ్వ దిశ సమాచార పంపిణీ వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత అనే రెండు విధానాలుగా వుంటుంది. ప్రధానవర్గాలు (Focus groups) ప్రగతి నివేదికలు (progress reports), నియతకాలిక నివేదికలు (Periodic reports) నియతకాలిక సమావేశాలు (Periodic meetings), దర్యాప్తునివేదిక (investigation reports) సూచనల పెట్టి (Suggestions box), సర్వేలు (Surveys) వ్యవస్థీకృత ఊర్ధ్వదిశ సమాచార పంపిణీగా చెప్పవచ్చు.

క్షేత్ర స్థాయిలో నాయకులతో కార్యకర్తలు జరిపే సంభాషణలలో బుద్ధి పూర్వకంగా లేదా యాదృచ్ఛికంగా సమాచారం అందించడం, పనిని మందగింపచేయడం, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోకపోవడం గైర్హజరు వంటి చర్యలు అవ్యవస్థీకృత ఊర్ధ్వదిశ సమాచార పంపిణీగా చెప్పవచ్చు.

ఆరోగ్యకరమైన ఊర్ధ్వ దిశ సమాచార పంపిణీ విధానాలు కార్యకర్తల ప్రవర్తన, అభిప్రాయాలు, ఇబ్బందులు, పార్టీ సమస్యలు, కార్యక్రమాల ప్రగతి, మానవ, ఆర్థిక పరమైన వనరులను మరింత సద్వినియోగం చేసుకోగల అవకాశాలను నాయకులకు కల్పిస్తాయి. కార్యకర్తలు సవాళ్ళను ఎదుర్కోవడానికి, వాస్తవాలకు సంబంధించిన స్థూల దృష్టిని అలవరచుకోవడానికి, నిర్ణయాలు తీసుకునే అవకాశాలు లభించడానికి, సమస్యలను పరిష్కరించడానికి, సంభావ్య నాయకులుగా స్వీయ సామర్థ్యాలను పొందడానికి ఊర్ధ్వదిశ సమాచార పంపిణీ తోడ్పడుతుంది.

మితిమీరిన ఊర్ధ్వదిశ సమాచార పంపిణీ అవాంఛనీయం. అనవసరమైన, పెద్ద పరిమాణంలో వున్న ఊర్ధ్వదిశ సమాచార పంపిణీ నాయకత్వ సమయాన్ని హరిస్తుంది. అతిచిన్న విషయాలకు కూడా కొంత మంది నాయకులు ఎక్కువ ఉద్రేక పడవచ్చు.

నాయకుడు ఊర్ధ్వదిశ సమాచార పంపిణీని ప్రోత్సహిస్తూ, సరైన చర్యలు తీసుకోక పోయినట్లయితే కార్యకర్తలు మనోస్థైర్యాన్ని కోల్పోతారు.

**అధో దిశ సమాచార పంపిణీ :** దీనిలో సమాచారం నాయకులనుండి కార్యకర్తలకు మౌలిక ఆదేశాలు (ఉత్తర్వులు, ఆజ్ఞలు, వ్యాఖ్యలు) మెమోలు, విధానాలు, శిక్షణ సామాగ్రి, పనికేటాయింపులు, నిర్వహణ మూల్యాంకనాలు పార్టీ పత్రికలు, వార్తలేఖలు ఇత్యాదిగా గల రూపంలో వుంటాయి. దీనిని దుర్వినియోగం లేదా మితిమీరి వినియోగించడం వల్ల కార్యకర్తల్లో **'నాయకుల సూచనల కోసం నిరీక్షణ'** పరిస్థితి ఏర్పడుతుంది. **'కార్యకర్తల్లో క్రమంగా చొరవ నశించి, నాయకుడి ఆదేశాలను పెడచెవిన పెట్టడం, సందేశాలను విస్మరించడం ప్రారంభిస్తారు.**

**పార్శ్వదిశ సమాచార పంపిణీ లేదా (సమాంతర సమాచార పంపిణీ) :**

దీనిలో ఒకేస్థాయి నాయకుల లేదా కార్యకర్తల మధ్య పరస్పర చర్య, సమాచార పంపిణీ వుంటాయి. వివిధ విభాగాల కార్యకలాపాలను అనుసంధానం చేయడానికి, జట్టు స్ఫూర్తిని పెంపొందించడానికి, జట్టుల మధ్య సమాచారాన్ని పంచుకోవడానికి, సమస్యలను పరిష్కరించుకోవడానికీ పార్శ్వదిశ సమాచార పంపిణీ సహాయకారిగా వుంటుంది. ఇది అధోదిశ సమాచార పంపిణీలో తలెత్తే జాప్యాలను నివారిస్తుంది.

**ఈ మూడు రకాల సమాచార పంపిణీని సమర్థంగా సమన్వయం చేసి, పార్టీని కార్యకర్తలను లక్ష్య సాధనదిశగా కార్యోన్ముఖులను చేసి విజయతీరాలకు చేర్చేవాడే నిజమైన నాయకుడు.** ❍

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం

* * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * *

## విజయనగరం జిల్లా




### జిందాల్ భూసేకరణలో అవినీతి నిజమే

- విచారణకు ఏసీబీ ముందుకురావడం హర్షనీయం
  ఇది లోక్‌సత్తా నైతిక విజయం
- విలేఖరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

**విజయనగరం అర్బన్ :** జిందాల్ కర్మాగారం కోసం భూసేకరణలో జరిగిన అవకతవకలపై లోక్‌సత్తా ప్రజల ముందుంచిన అంశాలు నిజమేనని ప్రభుత్వం భావించడం లోక్‌సత్తా పార్టీ నైతిక విజయంగా భావిస్తోందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ అన్నారు. అధికారులు 12 మంది బోగస్ లబ్దిదారులను ప్రాసిక్యూట్ చేయడం కోసం ప్రభుత్వాన్ని కోరడం హర్షనీయమన్నారు.

భూసేకరణలో జరిగిన అక్రమాలపై జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ నైతిక బాధ్యత వహించాలని ఆయన అన్నారు. జిందాల్ భూసేకరణలో భాగంగా 1048.65 ఎకరాలు సేకరించగా అందులో 866.67 అసైన్డ్ డిపట్టా 181.98 సెంట్లు ఎంక్రోచ్ మెంట్లు కలిగి ఉన్నాయని ఎకరాకు 2.05 లక్షల చొప్పున రూ॥22 కోట్లు 24 లక్షల 40వేల వరకు చెక్కులు ద్వారా చెల్లింపులు జరిగాయన్నారు. ఇందులో జరిగిన అవకతవకలను వివరాల వారీగా సభ్యులు విశ్రాంత రెవెన్యూ ఉపకలెక్టర్‌లు పున్నాన కోటేశ్వరరావు. యెజ్జు సత్యనారాయణ, పార్టీ ప్రతినిధులు డి. సూర్యారావు, ఎ.శివసన్యాసిరావు, కె.వి.ఎస్.శర్మలతో కూడిన బృందం ప్రభుత్వానికి అందజేసింది. ఈ విషయంలో డాక్టర్ జయప్రకాష్ నారాయణ ప్రభుత్వాన్ని నిలదీశారని ఆయన అన్నారు. కొంత మేరకు జరిగిన ఏసీబీ దర్యాప్తు వలన ఎలాంటి లాభం లేదనీ, కోట్లాది రూపాయల చెల్లింపుల్లో పేదరైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తిరిగి వారికి న్యాయం చేకూరాలని ఆధారాలతో లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తోందన్నారు. పరిశీలించి నష్టపోయిన రైతులకు తగిన న్యాయం చేయాల్సిందిగా లోకాయుక్తను కోరుతామని కోటేశ్వరరావు సత్యనారాయణ అన్నారు.

లోక్‌సత్తా చేసిన ఫిర్యాదు మూలంగా ఇంకా దుర్వినియోగం కావాల్సిన ప్రజాధనం ప్రస్తుతం చెక్కుల రూపంలో ఆర్డివో కార్యాలయంలో ఉందని త్వరలో వివరాలు బయట పెడతామని అన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పి.కోటేశ్వరరావు, యెజ్జు సత్యనారాయణ, పార్టీ ప్రతినిధులు దొడ్డి సూర్యారావు లక్కరాజు శివరామారావు, వెంకట రమణ, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

### రహదారుల నిర్మాణంలో అక్రమాలు

- లోక్‌సత్తా నేతల ఆరోపణ
- ఉపాధి అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

**విజయనగరం :** జిల్లాలో చేపడుతున్న ఉపాధి హామీపనుల్లో అవినీతికి అడ్డులేకుండా పోయిందని లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అరోపించారు. పంచాయతీ రాజ్‌శాఖ అధ్వర్యంలో సాగుతున్న రోడ్ల పనులపై అనేక ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని అరోపించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో అక్రమాలపై లోక్‌సత్తా సమగ్ర నివేదిక తయారు చేసిందని, వాటిపై దర్యాప్తునకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్. సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు బాబ్జీ వెల్లడించారు. కొంతమంది తమ పొలాలకు రహదారులు వేసుకునేందుకు సిద్ధమైనా ఇంజనీరింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. 22 మండలాల్లో అవినీతి ఆరోపణలు తీవ్రస్థాయిలో ఉన్నాయని, ఆ శాఖ కమిషనర్ ఎస్ఎస్ రావత్, డైరెక్టర్ ఎ. మురళీలకు వివరాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ప్రతినిధులు ఎంఎస్ఎన్ రాజు, ఎల్. శివరామారావు, యువసత్తా అధ్యక్ష కార్యదర్శులు పి.వి.రమణ కె.దయానంద్‌లు పాల్గొన్నారు.

### చట్టంలో లోపాలున్నాయి

**విజయనగరం:** "కోట్లాది మంది చూస్తుండగానే ముష్కరులు దాడికి పాల్పడ్డారు. లోసుగులుండటం వల్లే ఈ విధంగా జరుగుతోంది. పార్లమెంట్‌పై దాడికి పాల్పడిన అఫ్జల్ గురును

ఉరితీయాలి. దేశంపై ఇటువంటి నేరాలకు పాల్పడుతూ పట్టుబడిన వారిని స్పెషల్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి శిక్షలు తొందరగా అమలు చేయాలి. చట్టంలోని లోపాలకు అసరాగా తీసుకొని విచ్ఛిన్నకర శక్తులు చెలరేగిపోతున్నాయి". అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబ్జీ ప్రభుత్వాన్ని కోరారు.



## లేచింది మహిళాలోకం

**విజయనగరం :** మద్యపాన నిషేధం విధించాలంటూ మద్యపానంవలన వచ్చే దుష్ఫలితాలను ప్రజలకు తెలియచెప్పాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలోని గ్రామాగ్రామలను తిరగాలని లోక్‌సత్తా మహిళా విభాగం నిర్ణయించింది. రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధానమైన ఆదాయవనరుగా మద్యం తయారయ్యిందని ప్రజల జీవితాలను నాశనం చేస్తూ వారిని బాగా చూడాల్సిన ప్రభుత్వమే ఈ విధంగా చేస్తోందన్నారు. దీనిపై ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తూ లోక్‌సత్తా పార్టీ మహిళాసత్తా ప్రతి గ్రామం తిరుగుతుందని చెప్పారు. అడవాళ్ళతో పాటూ మగవాళ్లకు కూడా కౌన్సిలింగ్ చేస్తామని చెప్పారు. దీనికంతటికి నిరక్షరాస్యత ప్రధాన కారణమని అందుకే ప్రతి ఒక్కరూ చదువుకోవాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, సుహాసిని చెప్పారు. రాష్ట్రంలో అత్యాచారాలు, యాసిడ్ దాడులు విపరీతంగా పెరిగిపోయాయని సమాజంలో మహిళలకు సరైన భద్రతలేదన్నారు. ఈ దాడులకు పాల్పడే వారిని కఠినమైన శిక్షలు పడే చట్టాలు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని, అసిస్టెంట్ ట్రెజరరి ఇ. రమణి, ఐ.అనంతలక్ష్మీ, ఎం.సుభద్రాదేవి, రాయి పద్మావతి, ఎం.భారతి, సిహెచ్, రామలక్ష్మీ పాండ్రింకి సీతామహాలక్ష్మీ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## యువసత్తా పైనే దేశ భవిత

**విజయనగరం :** దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని యువసత్తా జోనల్ కో-ఆర్డినేటర్ పి.రాంబాబు అన్నారు. అవినీతి లేని పాలనకు కృషిచేస్తున్న లోక్‌సత్తా పార్టీలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో యువసత్తా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతి రాజకీయాలకు స్వస్తి పలకాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు. సమాజంలో పెరిగిపోతున్న అవినీతి, అక్రమాలపై అలుపెరగని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు పి. వెంకటరమణ మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత ప్రధాన భూమిక పోషించాలన్నారు. గ్రామస్థాయి నుంచి నిజాయితీ రాజకీయాలకు పునాది వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.దయానంద్, బెవర్ వేణుగోపాల్, వీకేవీఎస్ఎన్‌పి. వర్మ తదితరులు పాల్గొన్నారు.



## కర్మాగారాన్ని కాపాడుకుందాం

**జామి :** భీమసింగి సహకార చక్కెర కర్మాగారాన్ని పార్టీలకతీతంగా కాపాడుకుందామని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. జామిలో భీమసింగి సహకార చక్కెర కర్మాగారం ప్రైవేటీకరణ పై రైతులతో, నాయకులతో చర్చావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. గ్రామస్థాయిలో రైతులతో సంతకాలు సేకరించాలన్నారు. రైతుల షేరుధనంతో నిర్మించి నడుపుతున్న కర్మాగారాన్ని రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ప్రయివేటీకరణ చేయడం దారుణ మన్నారు. ఒక టన్ను చెరుకు కూడా సరఫరా చేయని వ్యక్తులు కర్మాగారంపై పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తుల జోక్యం వల్లే కర్మాగారం నష్టాల బారిన పడుతున్నదన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు నాగార్జున, వర్మ, ఎం. అప్పారావు, రమేష్, నాగరాజు, దేశం నాయకులు బి. స్వామినాయుడు, పత్రి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో అడుకుంటున్న ప్రభుత్వం

**విజయనగరం (కోట):** ఓట్ల కోసం ఎన్నికల ముందు విద్యారంగంలో అకర్షణీయ పథకాలను ప్రకటించిన ప్రభుత్వం,




వాస్తవిక కోణంలో సరి చేస్తున్నామని చెబుతూ విద్యార్థులతో అటలాడుకుంటోందని ఆరోపిస్తూ జిల్లా యువసత్తా అధ్యక్ష కార్యదర్వులు పాండ్రంకి వెంకటరమణ, కె. దయానంద్ ఒక ప్రకటన చేసారు. ట్రిపుల్ ఐటిసీట్లు తగ్గించటం, కార్పొరేట్ కళాశాలల్లో పేద, ఎస్సీ, ఎస్టీ, బీసి విద్యార్థులకు మెరుగైన విద్యను రద్దు చేసామని ప్రకటించి విద్యార్థులను అయోమయానికి గురి చేసిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఈ స్కీము ఉపయోగపడుతుందని దీని రద్దు చేయాలన్న నిర్ణయం వల్ల విద్యార్థులకు ఇది శాపంగా మారుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని అధ్యక్ష కార్యదర్శులు ఈ సందర్భంగా డిమాండ్ చేసారు.

### ఉపాధి పనులపై ప్రత్యేక దర్యాప్తు చేయాలి

**విజయనగరం :** జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దర్యాప్తు చేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై పథకం డైరెక్టర్ ఎ మురళీని పార్టీ బృందంతో కలిసి చర్చించినట్లు ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ అధ్వర్యంలో పనులు జరుగుతున్న రోడ్లపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని ఆయనను కోరినట్లు పేర్కొన్నారు. అదే విధంగా జిల్లాలో రాజకీయ నాయకుల అండతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, పత్రికల్లో వచ్చిన వార్తలు, ఫిర్యాదు జిల్లాకే పరిమితమవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్ళినట్లు చెప్పారు.

రోడ్లు, చెరువుల్లో జరుగుతున్న విచ్చలవిడి అవకతవకలకు అడ్డుకట్ట వేయక పోతే భవిష్యత్ ప్రమాదకరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రత్యేక అంబుడ్స్‌మెన్ అవసరమని కోరారు. పూర్తి అధికారాలు కలిగిన స్వయం ప్రతిపత్తి కల్గిన అంబుడ్స్‌మెన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

### బీపీఎస్ నిధులు వార్డు కమిటీల అధ్వర్యంలో ఖర్చు చేయాలి

**విజయనగరం రూరల్ :** అక్రమ భవన నిర్మాణాల (బీపీఎస్) నిధులను వార్డు కమిటీల అధ్వర్యంలోనే ఖర్చు చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బీశెట్టి బాబ్జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానికంగా ఎన్నికైన వారు సభ్యుల అధ్వర్యంలో పనుల నిర్ధారణ జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

## కడప జిల్లా



### తహశీల్దార్ తీరు బాధాకరం

**కడప జిల్లా, బద్వేలు అర్బన్ :** న్యాయం కోసం కార్యాలయానికి వెల్లిన బాధితుల పట్ల తహశీల్దార్ వినాయకం ప్రవర్తించిన తీరు బాధాకరమని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. లోక్‌సత్తా అధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్మీలో విధులు నిర్వర్తించిన షేక్ ఇస్మాయేల్ అజాద్‌కు 1983వ సంవత్సరంలో ఎత్తిరాజుపల్లె పొలం సర్వే నెంబరు 423/2లో 5 ఎకరాలకు ప్రభుత్వం పట్టా ఇచ్చింది. అదే పొలానికి 1996లో రెవెన్యూ అధికారులు స్థానిక మిద్దెలపాలెంకు చెందిన దోమా తిరుమలయ్య అనే మరో వ్యక్తికి పట్టా ఇచ్చారు. జరిగిన అన్యాయాన్ని తెలుసుకునేందుకు కార్యాలయానికి వెళ్లిన లోక్‌సత్తా నాయకులు, బాధితుడి కుమారుడు ఏజాజ్‌బాషా పట్ల తహశీల్దార్ దురుసుగా ప్రవర్తించారు. బాధితునికి మూడు రోజులలోగా సరైన న్యాయం జరగకపోతే అమరణ నిరాహార దీక్షకు పూనుకుంటామని లోక్‌సత్తా నియోజక వర్గ కన్వీనర్ వెంకటేశ్వర్ రాజు తెలిపారు. ఈ ధర్నాలో అఖిలపక్ష నాయకులు జి.చంద్రశేఖర్, వీరశేఖర్, వెంకటేశ్వర్లు చిన్నయ్య, చిన్న, విజయ్, నంద పాల్గొన్నారు.

## లోక్‌సత్తా నేతల దీక్ష విరమణ తహశీల్దారుతో ఫలించిన చర్చలు

**కడప జిల్లా, బద్వేలు :** తహశీల్దారు కార్యాలయం దగ్గర గత అయిదు రోజులుగా లోక్‌సత్తా అధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షను తహశీల్దారు వినాయకం నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. ఈ సందర్భంగా సీపీఐ వెంకటసుబ్బయ్య సీపీఎం చంద్రశేఖర్ లోక్‌సత్తా నాయకుడు వెంకటేశ్వరరాజుతో తహశీల్దారు తన కార్యాలయంలో సాయంత్రం అయిదు గంటలనుంచి ఏడు వరకు చర్చలు జరిపారు. మాజీ సైనికునికి గతంలో రద్దు చేసిన భూమికి బదులు మరో చోట భూమి ఇచ్చేందుకు కలెక్టరు దగ్గరకు వెళ్లి సంతకం పెట్టించుకొని వస్తే బాధితునికి ఇస్తామన్నారు. పోలీసుల దగ్గర ఉన్న లోక్‌సత్తా నాయకుని సెల్‌ఫోన్ తిరిగి ఇప్పించారు. చర్చలు సఫలం కావడంతో రిలే దీక్షలను నిర్వహించడం లేదని లోక్‌సత్తా నాయకుడు వెంకటేశ్వరరాజు తెలిపారు. ప్రరాపా నాయకులు, ఎస్.ఎం.బాష, అర్జున్, బీఎస్పీ, నాయకులు కేశవయ్య, డీబీఎఫ్ నాయకులు చిన్నయ్య టీఎన్ఎస్ఎఫ్ నాయకులు తిరుమల కొండయ్య షేక్ మహబుబ్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు జిల్లా




## లోక్‌సత్తా వైపు ప్రజల చూపు

**నరసరావుపేట :** కాంగ్రెసు, తెలుగుదేశం పార్టీలు ఒకదానిపై మరొకటి అవినీతి ఆరోపణలు చేసుకుంటున్న నేటి నేపథ్యంలో ప్రజలు ప్రత్యామ్నాయంగా లోక్‌సత్తా వైపు చూస్తున్నారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కఠారి శ్రీనివాసరావు అన్నారు. తేది : 18-5-10న నర్సరావు పేటలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లోక్‌సత్తా పార్టీ డబ్బు మద్యం పంచకుండానే, మున్సిపల్ సమస్యలపై స్పష్టమైన అవగాహనతో రానున్న పురపాలక ఎన్నికల్లో పోటీ చేస్తుందని కటారి ప్రకటించారు. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు పన్నుల రూపంలోకట్టే కోట్లాది రూ॥లు ప్రభుత్వ అవినీతి వల్ల దుర్వినియోగం అవుతోందని, ఇట్టి అవినీతిని అరికట్టేందుకే జేపీ గారు అసెంబ్లీలో అవినీతి వ్యతిరేక బిల్లు ప్రవేశపెట్టారని అన్నారు. పట్టణపార్టీ నేతలు. ఈదర గోపిచంద్, జి.ఉత్తమ్ రెడ్డి, కోడెల శ్రీనివాస్, పోతురాజు, ప్రసన్న కుమార్, చుండూరు సత్యనారాయణ, బాలభాస్కర్ యాలంకోటేశ్వరరావు, పలువురు మహిళానేతలు పాల్గొన్నారు.

## నిర్మలాబోస్ అధ్యక్షులుగా మహిళాసత్తా

**నరసరావుపేట :** అదేరోజు నర్సరావుపేట పట్టణ మహిళాసత్తా సమావేశం జరిగింది. ఇటీవలే నూతనంగా ఎన్నికైన జిల్లా మహిళాసత్తా అధ్యక్షకార్యదర్శులు కె. లలితకుమారి, కె. దుర్గాదేవిల ఆధ్వర్యంలో పట్టణ మహిళాసత్తా కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా ఘంటా నిర్మలాబోస్, కార్యదర్శిగా దంటు విజయశ్రీ, ఉపాధ్యక్షులుగా చంద్రగిరి పద్మావతి, సహాయ కార్యదర్శిగా కోల్లూరిలక్ష్మీ, కోశాధి కారిగా కోలగాని శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కోడెల విజయజ్యోతి, టి.స్వప్న, బెల్లం కొండ శివకుమారి, కామన పార్వతిదేవి, మువ్వల పూర్ణిమలను ఎన్నుకున్నారు. 22గా ఉన్న మహిళాసభ్యులను ఇంకా పెంచాలని మద్యవ్యతిరేక ప్రచారం చేపట్టాలని, మున్సిపల్ ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీ మహిళా సభ్యులు ఎక్కువ సంఖ్యలో పోటీ చేయాలని తీర్మానించారు.




## "మద్యం అమ్మకాలు పెంచుకోజూడటం గర్హనీయం"

**గుంటూరు పట్టణం :** 2010-12 ద్వైవార్షిక ఎక్సైజ్ విధానంలో, 15 శాతం ఎక్కువకు టెండర్లు ఆశిస్తున్న అధికార కాంగ్రెసు ప్రభుత్వ వైఖరిని గుంటూరు జిల్లా మహిళాసత్తా అధ్యక్షులు కె.లలితకుమారి, నర్సరావుపేట పట్టణ అధ్యక్షులు జి. నిర్మలాదేవి తీవ్రంగా విమర్శించారు. 28-05-10న నర్సరావు పేట పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర పార్టీ ఇచ్చిన మద్యవ్యతిరేక నిరసన వారాన్ని జయప్రదం చేయాలని తీర్మానించారు. 97-98లో 887 కోట్ల రూ॥తో ఆరంభించి, నాటి తెలుగుదేశం 2003-04 నాటికి 3572 కోట్లకు మద్యం

అమ్మకాలను పెంచిందని, అదేబాటలో గాంధీ పేరు చెప్పుకునే కాంగ్రెసు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బెల్టుషాపుల తీసివెయ్యకపోగా, ఇంకా పెంచి, మార్చి 2010 నాటికి 12 వేల కోట్లకు పైగా పేదల సొమ్మును దోపిడి చేసిందని విమర్శించారు. ఈ వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి చైతన్యం తెస్తామన్నారు.

# కృష్ణ జిల్లా



**విజయవాడ అర్బన్, సూర్యారావుపేట :** తేది.02-05-2010 లోక్‌సత్తా పార్టీ 59వ డివిజన్ అధ్యక్షులు బూర్ల కొండలరావు మరియు డివిజన్ కమిటీ అధ్వర్యంలో డివిజన్‌లో ప్రతి ఇంటికి వెళ్ళి వారి సమస్యల గురించి ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలైన రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, విద్యా వైద్యం ఉపాధి గురించి కూడా అడగడం జరిగింది. "ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి మాకు సరియైన అవగాహన లేదు" అని అక్కడ ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా ప్రజల వద్దకు తీసుకువెళ్ళి వాటి గురించి ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కొరకు త్రవ్విన రోడ్లను త్వరతగతిన బాగుచేయవలెనని దీని వలన ప్రజలకు ముఖ్యంగా పాదాచారులకు చాలా అసౌకర్యంగా ఉన్నది. కనుక వెంటనే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవలసిందిగా కోరారు.

ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి బండ్లమూడి మురళీకృష్ణ, 59వ డివిజన్ అధ్యక్షులు బూర్ల కొండలరావు, డివిజన్ ఉపాధ్యక్షులు ప్రసాద్, బ్రహ్మం, డివిజన్ కార్యదర్శి వేమూరి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి సాగర్ యువసత్తా అధ్యక్షులు రమేష్ మరియు కార్యకర్తలు కనకారావు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఓటమి ఎరుగని అమ్మ - లోక్‌సత్తా

**విజయవాడ అర్బన్, సూర్యారావుపేట :** మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని లోక్‌సత్తా పార్టీ విజయవాడ అర్బన్ జిల్లా 23వ డివిజన్ కమిటీ అధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హాలులో సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా మహిళా సత్తా అధ్యక్షురాలు శ్రీమతి పిల్లలమర్రి సరళకుమారి ప్రసంగిస్తూ "స్త్రీ జీవితమే త్యాగభరితమని ముఖ్యంగా కుటుంబంలో ఆమె పోషించని పాత్ర లేదని ఆమె లేని కుటుంబం చుక్కాని లేని నావలాంటిందని, అట్లాంటి అమ్మను ఆదినుండి తుదివరకు ఎవరు గౌరవిస్తారో వారు ఉన్నతంగా జీవిస్తారని సమాజం మన్ననలు పొందుతారని" అన్నారు.

కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చిన అర్బన్ అధ్యక్షులు చుండూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'అమ్మ జీవితం నిరంతరం పోరాటమని, అలుపు సొలుపు లేకుండా సాగే చైతన్య మూర్తి అని, కుటుంబానికి అమ్మ ఎలాంటిదో సమాజానికి లోక్‌సత్తా పార్టీ కూడా అమ్మ పాత్ర పోషిస్తుందని, ఎన్ని కష్టాలు ఎదురైనా అంతిమ విజయం తమదేనని అన్నారు.

అర్బన్ కార్యదర్శి బండ్లమూడి మురళీకృష్ణ మాట్లాడుతూ అమ్మ ఓడితే మనకు బతుకే లేదని అందువలన అమ్మకు ఓటమే లేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో అర్బన్ కార్యదర్శులు శ్రీమతి భూపతి శోభారాణి, బండారు పూర్ణ చంద్రరావు, యువసత్తా నాయకులు ఉపేంద్ర, పిల్లి ఏసుపాదం, ఆవల కనకారావు మరియు స్థానిక నాయకులు ఎ.రాజా, రజనీకాంతశర్మ, శివప్రసాద్, మహిళా కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**విజయవాడ, సూర్యారావుపేట్ :** లోక్‌సత్తా పార్టీ మహిళాసత్తా అధ్వర్యంలో తేది : 13-05-2010 ఉదయం లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మహిళాసత్తా సమావేశము ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర మహిళాసత్తా అధ్యక్షురాలు యన్.సరోజాదేవి, ఉపాధ్యక్షురాలు యం. మహాలక్ష్మీ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. వారి అధ్వర్యంలో జిల్లా, అర్బన్ జిల్లా, మహిళాసత్తా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవటం జరిగింది. మరియు మహిళాసత్తా కార్యక్రమాల గురించి చర్చించటం జరిగింది.

**జిల్లా అధ్యక్షురాలు: శ్రీమతి వంగర నాగమణి,**
**ఉపాధ్యక్షురాలు: పి. సరళకుమారి, కార్యదర్శి: వి. శ్రీదేవి, జాయింట్ సెక్రటరీ: యన్.మాలతి, యం.కిరణ్మయి, ట్రెజరర్ : కె. విజయలక్ష్మీ, అధికార ప్రతినిధి: వి. రాజమణి, లీగల్‌సెల్ : యం.జ్ఞానాంబ, కార్యవర్గ సభ్యులు: డి. ఉమాదేవి, యం.మీనాక్షి, స్వరూపరాణి, యన్.పద్మజ, కె.సంపూర్ణమ్మ, షేక్ మహబూబ్, పి.నళిని, శిష్టా భార్గవి.**

**వివిధ అంశాలపై మీరడిగే ప్రశ్నలకు**
**డా॥ జేపీ సమాధానాలిస్తారు. ప్రచురించబడిన ప్రతి ప్రశ్నకు రూ॥ 100/- పారితోషికం ఇవ్వబడును**



**విజయవాడ అర్బన్ జిల్లా , సూర్యారావుపేట :** లోక్‌సత్తా పార్టీ అర్బన్ జిల్లా మహిళా సత్తా అధ్వర్యంలో 09-05-10వ తేది అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా 08-05-2010వ తేదీన పార్టీ కార్యాలయంలో మహిళలందరూ మాతృదినోత్సవాన్ని జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా సత్తా నాయకురాలు కేకును కట్‌చేసి, స్టిచ్చింగ్ మరియు వక్తృత్వ పోటీలను నిర్వహించడం జరిగింది. మహిళలు ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అర్బన్ ప్రధాన కార్యదర్శి వి. రాజమణి మాట్లాడుతూ మంచి పౌరుడుని సమాజానికి అందించటంలో తల్లి పాత్ర ఎంతో ముఖ్యమైనది అని అన్నారు. మహిళా సత్తా ప్రెసిడెంట్ వి.నాగమణి మట్లాడుతూ మంచి బిడ్డలను అందించడం ద్వారా మంచి సమాజం ఏర్పడుతుంది అని తల్లి క్రమశిక్షణలో పెరిగిన పిల్లలు తమ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోపిస్తారని, కుటుంబంలోనూ, సమాజంలోనూ ఎంతో ప్రాముఖ్యత ఉన్న మాతృమూర్తిని గౌరవించడానికే అంతర్జాతీయ మాతృ దినోత్సవం జరుపుకొంటారని వివరించారు. మహిళాసత్తా సెక్రటరీ యన్. మాలతి మాట్లాడుతూ ప్రతి తల్లి చదువుతో పాటు సమాజంలో ఎలా మెలగాలో పిల్లలకు నేర్పాలని అన్నారు. మహిళాసత్తా కోశాధికారి కె. విజయలక్ష్మి, మహిళాసత్తా ఉపాధ్యక్షురాలు యం.మీనాక్షిగారు పాల్గొన్నారు.

పోటీలలో ప్రధమ బహుమతి వచ్చిన అన్నపూర్ణ, ద్వితీయ బహుమతి మాధవీలకు బహుమతులు ప్రధానం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళాసత్తా నాయకురాలు, కార్యకర్తలు, యువసత్తా నాయకులు గడ్డం శివకుమార్, యార్లగడ్డ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమగోదావరి జిల్లా,

**ఏలూరు నగర శాఖ :** లోక్‌సత్తా పార్టీ నగరశాఖ ఆధ్వర్యంలో తేది : 10-05-2010 నుండి 2-6-2010 వరకు జిల్లా పార్టీ కార్యాలయంలో హై స్కూల్ విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులను ప్రతిరోజు సా॥4.30 గం॥ల నుండి 6.30 ని॥లకు వరకు యువసత్తా జిల్లా సెక్రటరి ఎ.శివరామ కృష్ణ నగర అధ్యక్ష కార్యదర్శులు, వైస్ ప్రెసిడెంట్, శ్రీ భరద్వాజ్, రంభా సుందరరావు, పి. సన్యాసిరాజు పర్యవేక్షణలో నిర్వహించుట జరుగుచున్నది. ఈ కార్యక్రమానికి సవు, పి. సన్యాసిరాజు పర్యవేక్షణలో నిర్వహించుట జరుగుచున్నది. అన్ని తరగతుల వారు సుమారు 50 మంది వరకు హాజరు అవుతున్నారు.



## బాధితులను పరామర్శించి సాయం అందించిన లోక్‌సత్తా నాయకులు

**నల్గొండ జిల్లా, మిర్యాలగూడ :** పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో కలుషిత నీరుతాగి అస్వస్థతకు గురై స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను లోక్‌సత్తా పార్టీ నాయకులు పరామర్శించారు. సంఘటనకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొబ్బరిబొండాలు అందజేశారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రజలు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షులు మద్ది వెంకటేశ్వర్లు, కార్మదర్శి, ఎండి. కుతుబుద్దీన్, విశ్వనాథుల రమేశ్‌చారి, ఎడి. బాబా, ఎండి. షఫీ, మల్లేశ్, జాకీర్‌లతో పాటు డాక్టర్ ఎంఎస్ నాయక్ ఉన్నారు.

## సూచన

**మీ జిల్లాలో లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు తదితర సమాచారాన్ని తప్పనిసరిగా ఫొటోలతో పాటు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించండి. వీలువెంబడి వాటిని వరుసగా ప్రచురిస్తాం. స్థానికంగా మీ కార్యక్రమాల్ని రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోండి.**

# అమెరికాలో జేపీ పర్యటన



హుస్టన్‌లో



న్యూజెర్సీలో



అట్లాంటాలో



వాషింగ్టన్ డిసిలో



వాషింగ్టన్ డిసిలో



వాషింగ్టన్ డిసిలో



వాషింగ్టన్ డిసిలో



వాషింగ్టన్ డిసిలో

RNI.Reg. No. APTEL/2010/32219



హ్యూస్టన్‌లో ప్రసంగిస్తున్న డా॥ జేపీ



హ్యూస్టన్‌లో లంచ్ గెట్ టు గెదర్ కి హాజరయిన అతిధులనుద్దేశించి ప్రసంగిస్తున్న
తమిళనాడు లోక్‌సత్తా శాఖ అధ్యక్షులు విజయ్‌ఆనంద్

From,

To,

Book-Post
PRINTED MATTER

Lok Satta Times
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad